అత్యధిక పాఠక ఆదరణ పొందుతున్న ఆధ్యాత్మిక పత్రిక

ప్రపత్తి

# శ్రీసన్నిధానం

ఆధ్యాత్మిక మాస పత్రిక

కరీంనగర్ సంపుటి: 01 సంచిక: 05 జులై 2024 పేజీలు:36 వెల:30





# ముఖచిత్రపరిచయం

మగువల ఆరోగ్యానికి గోరింటాకు (మైదాకు)కు అనుబంధం ఉంది. ఆషాఢమాసం వర్షాకాలంలో వస్తుంది. వాతావరణ మార్పులు సంభవిస్తాయి. క్రిమి కీటకాలు వృద్ధి చెందుతాయి. వ్యాధులు ప్రబలుతాయి. వీటి నివారణకోసం మన సనాతన ధర్మం ఆచరణ యోగ్యమైన వాటిని ఆయా సందర్భాలలో ఆచరించాలని సూచించింది. ఆరోగ్యాన్ని పెంచే విధంగా గోరింటాకు ఉపయోగపడుతుందని, దీనిని చేతులకు, కాళ్లకు పెట్టుకోవడం వల్ల క్రిమికీటకాల వల్ల వచ్చే వ్యాధులు ప్రబలకుండా రోగనిరోధక శక్తిని ఇస్తుందని, రక్త ప్రసరణ సక్రమంగా జరిగేలా చేస్తుందని కూడా ఆయుర్వేదం చెబుతుంది. “గోరింట పూచింది కొమ్మ లేకుండా.” అని సినీ కవులు చెప్పినట్లు అతివలకు ఇది అందాన్ని అదృష్టాన్ని తెస్తుంది. గోరింటాకు ఎప్పుడు పెట్టుకోవాలో, దానివల్ల జరిగే లాభాలు ఏమిటో కూడా జానపదగీతాలు ఇప్పటికీ గ్రామాల లో పాడుకోవడం కనిపిస్తుంది. అడవులు అంతరిస్తున్నాయి. బహుళ ప్రయోజనం అందించే అరుదైన మైదాకు మొక్కను ముళ్లచెట్టులా భావించి వాటిని నేలమట్టం చేస్తున్నాము. గర్భాశయానికి రక్తం చేరవేసే ప్రధాననాడులు సక్రమంగా పనిచేయడానికి, ప్రసవం కాగానే గోరింటాకు ముద్దగా నూరి బాలింతచేత మింగించేవారు. ప్రసవం వలన సంభవించే గర్భాశయ బాధలు దీనివల్ల నయమవుతాయి. గోరింటాకు పండటం అనేది మగువ ఆరోగ్యాన్ని సూచిస్తుంది. కానీ “కోనుల” రూపంలో మనకు లభిస్తున్న కృత్రిమమైనది గోరింటాకు అని పెట్టుకుంటే అనర్థమే సుమా!

# గమనిక

ప్రపత్తి శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాస పత్రికకు సలహాలు, సూచనలు, చందాదారుల చిరునామా మార్పులు, నూతన చందాదారులు కావడానికి ఇ-మెయిల్ ద్వారా తెలియజేయవచ్చును.

help desk:

prapatti.srisannidhanam9@gmail.com

మాస పత్రిక చందా వివరముల గురించి సంప్రదించవలసిన హెల్ప్ డెస్క్ నెంబర్:

9502583323

(ఉదయం 9 గం. నుండి రాత్రి 9 గం. వరకు)

yono SBI | SBI Payments

MERCHANT NAME: SRI SANNIDHANAM CHARITABLE TR

UPI ID: 9502583323@SBI

SCAN & PAY

BHIM SBI Pay

BHIM UPI

సంప్రదించండి

మా ఈ చిరు ప్రయత్నాన్ని స్వాగతించండి!!

-మేనేజింగ్ ఎడిటర్

## ముఖ్య గమనిక

ప్రపత్తి శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాస పత్రిక ఈ సంచికలో ప్రచురించిన రచనలలోని భావాలు ఆయా రచయితలవే, రచన సారాంశము రచయిత అభిప్రాయముగా భావించవలెను. ఈ రచనల భావంతో సంపాదకునికి, ట్రస్ట్‌నకు ఎటువంటి బాధ్యత లేదని పాఠకులు గమనించవలసినదిగా మనవి.

– ఎడిటర్

ప్రపత్తి శ్రీసన్నిధానం

https://srisannidhanam.org

prapatti.srisannidhanam9@gmail.com

సంపుటి: 1 - సంచిక: 5 ఎడిటర్ : డింగిరి శ్రీనివాసమూర్తి జులై 2024 వెల : 30

## ఇందులో

4. సంపాదకీయం
శ్రీమాన్ శ్రీ వొద్దిపర్తి రామచంద్రమూర్తి
6. శ్రీరామానుజ సుధామాధురి
శ్రీమతి సముద్రాల శారద
8. శ్రీపతిస్తుతి
శ్రీమాన్ శ్రీ అమరవాది వేంకటనర్సింహాచార్యులు
9. శుభాశుభ నిర్ణయాలు-మీమాంస
శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య, సిద్ధాంతి
11. భాగవతంలో భగవంతుని కథలు
శ్రీమతి తిరుమల నీరజ
13. బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవమ్
శ్రీమాన్ శ్రీ సముద్రాల శఠకోపాచార్యులు
14. సత్సంప్రదాయ సేవలో శ్రీఅష్టలక్ష్మీ పీఠం
16. గీతామృతం
శ్రీమాన్ ఆచి వేంకట పాండురంగాచార్య
18. జగద్గురు వేదవ్యాస మహర్షి (ప్రత్యేకం)
శ్రీమాన్ శ్రీ కె.ఇ.స్థలశాయి
20. తొండమాన్ చక్రవర్తి
శ్రీమతి మహాలక్ష్మీ రాణి గుండు
21. శ్రీమత్ యామునాచార్యుల తనియన్
శ్రీమాన్ శ్రీ డా.వోలేటి రవికుమారాచార్యులు
22. జ్యోతిర్విజ్ఞానమ్
శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక
23. భగవంతునిపైన భారము
శ్రీమతి వంగల రాధిక
25. శ్రీరామాయణంలో ఉపకథలు
శ్రీమతి చక్రవర్తుల చూడామణి
27. భారతము పంచమవేదము
శ్రీమాన్ శ్రీ డా.అ.కం. పెరుమాళ్ళాచార్యులు
28. వాల్మీకి చూసిన హనుమంతుడు
శ్రీమాన్ శ్రీ డా. ఆచార్య వేణు
30. పద్దెనిమిది రహస్యములు
శ్రీమాన్ శ్రీ నెల్లుట్ల దత్తాత్రేయ స్వామి
31. గోసేవ, శ్రీమతి మామిడిపల్లి రాజ్యలక్ష్మి

నెలవారిపంచాంగం, మనదేవాలయాలు, పుస్తక పరిచయం, బాలవిజ్ఞానం, శ్రీసన్నిధిపదకేళి

**సంపాదక మండలి**

వొద్దిపర్తి రామచంద్రమూర్తి చీఫ్ ఎడిటర్
సముద్రాల శారద వొపీనియన్ ఎడిటర్
డింగిరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్

**గౌరవ సంపాదకులు**

శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక
శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి ఆచార్య
శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనర్సింహాచార్యులు

నోట్:- సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు మీరూ మాతో కలిసినడువండి! అంతర్జాలంలో పబ్లిష్ చేసేవారు 'శ్రీసన్నిధానం సంచిక నుంచి సేకరణ' అని రాయడం మరువకండి!! కాపీ రైట్ చట్టానికి కట్టుబడి ఉందాం.

# సంపాదకీయం



# అగ్నిజ్వాలలు జ్ఞానాన్ని నాశనం చేయలేవు

**భా**రతదేశ చరిత్ర సువర్ణాక్షరాలతో రాసే నూతన శకానికి నాంది వాచకం పలికింది. బిహార్‌లోని నలందా విశ్వవిద్యాలయ నూతన ప్రాంగణం 2024 జూన్ 19న వైభవంగా ప్రారంభమైంది. ప్రాచీన భారతావనికి ఆయువుపట్టులాంటి వారసత్వ సంపద నలందా విశ్వవిద్యాలయం పూర్వవైభవం సంతరించుకుంటోంది. "నలంద అంటే ఒక గుర్తింపు, గౌరవం. నలంద ఒక విలువ, ఒక మంత్రం, ఒక గర్వం, ఒక కథ" అంటూ వైభవాన్ని ఉద్వేగంగా ప్రధాని మోదీ ప్రారంభోపన్యాసంలో పలికిన పలుకులు భారత జాతి గర్వంగా తలెత్తుకునేలా చేసింది. "పుస్తకాలు అగ్ని జ్వాలల్లో కాలిపోవచ్చు కానీ, అగ్ని జ్వాలలు జ్ఞానాన్ని నాశనం చేయలేవు" అనే సత్యాన్ని ప్రకటించేదే నలంద అని విధ్వంసాన్ని గుర్తు చేసారు. 5వ శతాబ్దం నుంచి 12వ శతాబ్దం వరకు ఎందరో మేధావులను ఈ విశ్వవిద్యాలయం అందించి ప్రపంచవ్యాప్తంగా పేరు తెచ్చుకుంది. ఆనాడు నలందాలో విద్యను అభ్యసించడానికి వివిధ దేశాలవారు వచ్చేవారు. చైనా పర్యాటకుడు హ్యువాన్ త్సాంగ్ (హ్యుయాన్ త్సాంగ్) నలందాలో అధ్యయనం చేశాడని, నలందాయూనివర్సిటీలో ఎన్నో తాళపత్ర గ్రంథాలలోని అమూల్య విషయాలను చైనా భాషలోకి అనువదించాడని చరిత్ర స్పష్టం చేస్తోంది. నలందా వైభవాన్ని హ్యువాన్ త్సాంగ్ తన రచనలలో ఆనాటి యూనివర్సిటీ వైభవాన్ని ప్రస్తావించారు. బుద్ధుడు పలు మార్లు నలందను సందర్శించాడు. మహావీరుడు నలందలో నివసించారు. అశోకుడు ఇక్కడ ఒక ఆలయాన్ని నిర్మించాడని చెబుతారు. నలందా క్రమంగా ప్రపంచ విద్యాకేంద్రంగా అభివృద్ధి చెందింది. నాగార్జునుడు నలందా విశ్వ విద్యాలయములో ఆచార్యుడుగా బోధించాడు. ఖగోళ శాస్త్రవేత్త ఆర్యభట్ట ఈ విశ్వవిద్యాలయం విద్యార్థే! ఆచార్యులుగా కూడా వారు నలందాలో పనిచేశారు. ఆకాలంలోనే వారు గణితశాస్త్రంలో సున్నాను ఆవిష్కరించారు. ఇలా చెప్పుకుంటూ వెళుతే 5వ శతాబ్దం నుంచి ఎన్నో అద్భుతాలు, మరెన్నో ఆవిష్కరణలు. ఎందరో బౌద్ధ సన్యాసులు, ప్రముఖుల పర్యవేక్షణలో సుమారు 90 లక్షలకుపైగా తాళపత్రాల గ్రంథాలు, విషయాలు, విశేషాలను తొమ్మిది అంతస్తుల భవన లైబ్రరీలో నిక్షిప్తంచేశారని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. హ్యువాన్ త్సాంగ్ చైనీస్ టెక్స్ట్ ది గ్రేట్ టాంగ్ రికార్డ్స్ ఆన్ ది వెస్ట్రన్ రీజియన్స్, హెచ్.డి సంకాలియా 1934లో ప్రచురించిన ది యూనివర్సిటీ ఆఫ్ నలందా ఇలా మరెందరో చరిత్రకారులు చేసిన రచనలను తిరగేస్తే ఎన్నో మరుపురాని సంగతులు, చీకటి రాత్రులు, నలందా శిథిలాల వెనుక గాథలు. మతోన్మాదంలో బఖ్తియార్ ఖిల్జీ నలందా విశ్వవిద్యాలయంపై దాడి చేసి వేలాది మంది విద్యార్థులను, బౌద్ధ సన్యాసులను, ఆచార్యులను ఊచకోత కోసి రక్తపుటేరులు పారించాడు. ఆతర్వాత కామరూప రాజు విశ్వ సుందర దేవా పృథ్వీ టిబెట్ వైపు వెళుతున్న ఖిల్జీని వెంటాడి దాడి చేసి మట్టికరిపించాడు. ఆవిషయాలు చరిత్రలో ఎక్కడా కనిపించవు. విశ్వ సుందర దేవా పృథ్వీ పేరు వినిపించదు. ఇప్పటికీ బిహార్‌లోని కొన్ని ప్రాంతాలలో ఖిల్జీ వీధులు, రైల్వేస్టేషను కనిపిస్తాయి సుమా! నలందాపై మతోన్మాదుల దాడి సందర్భంగా తొమ్మిది అంతస్తుల గ్రంథాలయాన్ని దగ్ధం చేసి భవనాలను నేలమట్టం చేశాడు. అప్పుడు సుమారు 90 రోజులు గ్రంథాలయంలోని తాళపత్రాలు కాలుతూనే ఉన్నాయని ఆప్రాంత వాసులు ఇప్పటికీ చెప్పుకుంటారు. ఉన్మాదచర్యలకు సాక్షీభూతంగా, ఆనవాళ్లు మాత్రం ఇప్పటికీ ఉన్నాయి. అలాంటి నలంద విశ్వవిద్యాలయాన్ని అదేచోట రాజ్‌గిర్‌లో కేంద్ర ప్రభుత్వం ఆధునాతంగా మళ్లీ నిర్మించింది. "జ్వాలలు జ్ఞానాన్ని నాశనం చేయలేవు" అనే సత్యాన్ని ప్రకటించే విధంగా నలంద తిరిగి రేపటి తరంకోసం గర్వంగా తలెత్తుకుని నిల్చునేలా నేటి పాలకులు రూపుదిద్దారు. నలందా విశ్వవిద్యాలయ నిర్మాణానికి 17 దేశాల సహకారం ఉన్నట్లు తెలుస్తోంది. ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, భూటాన్, బ్రూనై, దారుస్సలాం, కంబోడియా, చైనా, ఇండోనేషియా, లావోస్, మారిషస్, మయన్మార్, న్యూజిలాండ్, పోర్చుగల్, సింగపూర్, దక్షిణ కొరియా, శ్రీలంక, వియత్నాం సహా మొత్తం 17 దేశాల ప్రతినిధులు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. మళ్లీ నలందా విశ్వవిద్యాలయం పూర్వవైభవం సంతరించుకుంటుందనడంలో అతిశయోక్తిలేదు.

-వొద్దిపర్తి రామచంద్రమూర్తి (చీఫ్ ఎడిటర్)

# నెలవారి పంచాంగమ్

**ఆషాఢమాసం 06-07-24 శుక్లపక్షంతో ప్రారంభమై 05-07-24 వరకు, తదుపరి 04-08-24 నుండి శ్రావణమాసం**

05-07-24 వరకు ఆర్ద్ర కార్తి, 06-07-2024 నుండి 19-07-24 వరకు పునర్వసు కార్తి, 20-07-24 నుండి పుష్యమి కార్తి. **పండుగలు** : 02-07-24 సర్వేషాం ఏకాదశి, 05-07-2024 అమావాస్య, 07-07-24 పూరిజగన్నాథ రథయాత్ర, లష్కర బోనాలు, 10-07-24 శుక్రమౌఢ్య నివృత్తి, 11-07-24 స్కంధపంచమి, 17-07-24 సర్వేషాం (తొలి) ఏకాదశి, 21-07-2024 గురుపూర్ణిమ, 24-07-2024 సంకష్ఠహరచతుర్థి, 28-07-24 హైదరాబాద్ మహంకాళీ జాతర, 31-07-24 సర్వేషాం ఏకాదశి,

## మాస ఫలాలు



**మేషం:** ఈ నెల మీమాటకు ఎదురుండదు. అన్నింటా విజయం. చేయు వృత్తివ్యాపారములందు రాణించెదరు. కుటుంబ వ్యక్తుల మధ్య సఖ్యత. అనురాగం పెరుగును.



**వృషభం:** ఈ నెల ద్వితీయార్థంలో బాగుంటుంది. చేయు వృత్తివ్యాపారములందు రాణింపు ఉంటుంది. ఆర్థికంగా బాగుంటుంది.



**మిథునం:** ఈ నెల అన్నిరంగాలవారికి బాగుంటుంది. ఆరోగ్యంబాగుండి ఆర్థిక లావాదేవీల సంతృప్తి. ధైర్యంతో కూడిన పనులు చేసి విజయం సాధిస్తారు.



**కర్కాటకం:** ఈ నెలలో అంతంతమాత్రమే. మనో దుఃఖములు, పనులందు ఆటంకాలు, శారీరకశ్రమ, అశాంతి, అకాలభోజనాలు, దుస్సంఘటనలు,



**సింహం:** ఈ నెల అన్నిరంగాలవారికి ప్రథమార్థంలో బాగుంటుంది. తదుపరి ఆదాయంనకు మించిన ఖర్చు. ఆరోగ్యభంగాలు, బంధుమిత్ర విరోధాలు, ఉద్యోగులకు స్థానచలనం లేదా గృహమార్పులు తప్పవు. శారీరకశ్రమ,




**కన్య:** ఈ నెల విజయం, ధనలాభాలు, నూతన వ్యవహారములు కలిసివచ్చును. మీ మాటకు విలువ పెరుగును. ఇతరులకు మాట సహాయం. చేస్తారు. శతృవులపై ఆధిక్యత.



**తుల:** ఈ నెలంతా పట్టిందల్లా బంగారమే. ఆదాయం బాగుండి ఆరోగ్యలాభం, సమస్యల పరిష్కారం. కోర్టు వ్యవహారాలందు జయం, శతృజయం,



**వృశ్చికం:** ఈనెలలో ప్రథమార్థంలో బాగాలేనప్పటికీ, ఆర్థికంగా బాగుంటుంది. ధైర్యంగా ముందుకుపోగలరు. కొన్ని సమస్యలు పరిష్కారమగును.



**ధనుస్సు:** ఈనెలలో అనుకూలంగా లేనందువల్ల అనేక ఇబ్బందులు కలుగును. ఆరోగ్యభంగాలు, శారీరకశ్రమ, అలసట, ఏపని కలసిరాదు. అపనిందలు, అపవాదులు.



**మకరం:** ఈ నెలలో సమస్యలు కొని తెచ్చుకుంటారు. ఆర్థికంగా బాగుండును. అనవసరఖర్చులు చేస్తారు. బంధుమిత్రులతో విరోధాలు.



**కుంభం:** ఈనెల గ్రహచారం బాగున్నది. అన్నిరంగము లందు అన్నింటా జయం, ఆరోగ్యం బాగుంటుంది. ఆర్థిక లావాదేవీలు సంతృప్తి.



**మీనం:** ఈనెల చేయు వృత్తి వ్యాపారములందు అనుకూలత, ప్రతీవిషయంలో మొండిగా, పట్టుదలతో కార్యాలుసాధిస్తారు. ఆర్థికంగా బాగుండును. శత్రువులే మిత్రులై సహాయ సహకారములు అందిస్తారు.

### "పూరి జగన్నాథస్వామి రథోత్సవం"

ఆషాఢ శుద్ధ విదియ రథోత్సవం. సుభద్ర బలభద్రులతో కూడిన విష్ణువు (జగన్నాథుడు) రథం మీద ఊరేగింపుగా వెళ్లడం ఇక్కడ ఆనవాయితీ. ఈ రోజు ఆదినారాయణునకు రథోత్సవం అత్యంత ప్రీతికరమైనది. బలభద్రా సుభద్రా సమేతుడైన జగన్నాథుని అర్చించి, మూల విరాట్టులను రథంపై ఊరేగిస్తారు. ఈ దివ్యోత్సవం ప్రపంచ ప్రసిద్ధమైనది. ముగ్గురుదైవాలు మూడు రథాలపై ఊరేగుతారు. సంప్రదాయసిద్ధంగా జరిగే ఈ రథయాత్ర లోకక్షేమకరం. 'రథస్థం రాఘవం దృష్ట్వా పూర్వజన్మ నవిద్యతే' అని కదా అన్నారు.

### మంచి రోజులివిగో...

**ఈనెల వివాహ, గృహారంభ, గృహప్రవేశ శుభ ముహూర్తములు లేవు. కూపాలకు ముహూర్తాలు కలవు.**

# శ్రీరామానుజ సుధామాధురి

## కలికాల ప్రభావానికి కాలసూత్రం

కాలం చాలా విలువైనది. విద్యనార్జించే వారికి, జ్ఞానాన్నయినా సంపదనైనా సముపార్జించేవారికి మరింత విలువైనది. సాధన చేసేవారికి కాలము మరింత పవిత్రమైనది. కాల విశేషం చేతనే కార్యాలు సఫలం అవుతాయి. కృషి కాల ప్రభావం వల్లనే ఒక ప్రయోజన రూపం దాల్చుతుంది. కానీ ఆ కాలం తెలియనంత మృదువుగా పల్లం వైపు సాగే జల ధారలా జారిపోతూ ఉంటుంది.

"కలయతీతి కాలః" అనగా కాలం సమస్తాన్ని తనలో ఇముడ్చుకుంటుంది. కల్పాలు యుగాలు తరాలు ఎలా విలువైనవో అతి సూక్ష్మమైన ఘడియ కూడా ఎంతో విలు వైనదే! ప్రేరణాత్మకమయినది. అటువంటి కాలము సౌదామిని వంటిది. ఒకే మెరుపుతో సత్యాన్ని (పరిసరాలను) దేదీప్యమానంగా దర్శింప చేస్తుంది కర్తవ్యాన్ని ప్రేరేపిస్తుంది. ముహూర్త కాలమైనా ఒక గొప్ప కార్య సాధనకు అది మూలమైనదై ఎంతో విలువైనది అవుతుంది.

జగత్తును నడిపించేది హరించేది కొత్త ఆశలను చిగుర్చ చేసేది కాలమే! భగవత్ స్వరూపమైన కాలాన్ని అనుకూలంగా ప్రతికూలంగా మానవుడే తన చర్యల ద్వారా మారుస్తుంటాడు.

కాలాన్ని ఉజ్జీవన మార్గం వైపు నడిపించేది, కలికాలం ప్రభావాన్ని కాలదండంలా కాల సూత్రంలా నిలిచి హరించి ఉద్ధరించగలిగేదే రామానుజ మార్గము. అదే జగదాచార్యుల అనుగ్రహం.

పరమాచార్యులెందరో వేద ధర్మాలను ప్రబోధించినప్పటికీ కలి ప్రభావం చేత అజ్ఞాన,అన్య జ్ఞాన, విపరీత జ్ఞానముల చేత భావజాలం కలుషితమైపోతున్నది అని పెద్దలు చెబుతారు. అందుకే లౌకిక విద్యలతో పాటు ఆధ్యాత్మిక విలువలు పెంపొందిన నాడు మానవ జీవనం శాంతిమయం అవుతుందని వేద ధర్మం ప్రబోధిస్తుంది.

అటువంటి స్థితిలో లోకానికి ఒక ఉత్కృష్ట మార్గాన్ని చూపించడానికి కారణజన్ములై అవతరించిన వారు భగవత్ రామానుజాచార్యులు. వారి గొప్పతనాన్ని సమకాలికులైన శిష్యులు ఎందరో వెలువ రించారు.

భగవద్రామానుజుల ప్రథమ ప్రసిద్ధ శిష్యులు మొదలియాండాన్



**- శ్రీమతి సముద్రాల శారద**

అని పిలువబడు దాశరథి అనువారు.

అమృతతుల్యమైన యతిరాజుల ఆశ్రయము వారి శిష్యులకు కల్పతరువు వంటిది. కంచి వరదరాజస్వామి అనుగ్రహంతో సన్యాసాశ్రమం స్వీకరించిన భగవద్రామానుజులను సదాచారులైన ఇద్దరు శిష్యులు ఆశ్రయించారు. వారు ఆండాన్, ఆళ్వాన్ అని వీరిని జంటనామాలతో పిలుస్తారు. ఆచార్యులకు వీరు యజ్ఞోపవీత త్రిదండాలతో సమానం. ఎప్పుడు ఆచార్యులతోనే కూడి ఉండేవారు. భగవద్రామానుజా చార్యులు మంత్రార్థ అనుసంధానానికి, చరమ శ్లోక ఉపదేశానికి తిరుక్కోష్టియూరు గురువు గారి దగ్గరికి వెళ్లేటప్పుడు కూడా వీరిద్దరిని తీసుకువెళ్లారట.

మొదలియాండాన్ కు తల్లిదండ్రులు పెట్టిన పేరు దాశరథి కాంచీపురానికి తూర్పు వైపున పురుషమంగళం (పచ్చై వరణం) పేట్టై అని కూడా పేరు గల అగ్రహారంలో ధర్మపరాయణుడైన ఆనందదీక్షితులకు రామానుజాచార్యుల సోదరికి జన్మించిన కుమారుడు దాశరథి. యతి రాజుల మేనల్లుడుగానే కాక వీరు ప్రథమ శిష్యులుగా సత్ శిష్యులుగా ప్రసిద్ధులు. రామానుజుల పాదుకా స్వరూపులుగా, రామానుజన్ పొన్నడి అని త్రిదండ స్వరూపులుగా వైష్ణవ నాయకుడు అని (మొదలియాండాన్‌గా) ప్రసిద్ధి పొందారు. సహన సౌశీల్యాలకు మారుపేరైన మొదలి ఆండాన్ ఆచార్య భక్తి సాటిలేనిది.

# శ్రీరామానుజ సుధామాధురి



రామానుజాచార్యుల గురువగు పెరియనంబి కుమార్తె అత్తుల లక్ష్మి. ఈమె అత్తవారింటిలో సమస్య ఏర్పడి వారి కోపానికి గురి అయింది. ఆ సమయంలో సేవ చేయటానికి యతిరాజులు దాశరథిని వాళ్ల ఇంటికి పంపించారు. అక్కడ ఎంతో సహనంతో వంట మొదలైన అన్ని పనులు చేస్తుండేవారు. ఒకరోజు పెద్దల మధ్య వేదాంత చర్చ జరగగా చక్కని వివరాన్ని వారు ఇచ్చారు. అలా మాటల సందర్భంలో ప్రకటితమైన వారి పాండిత్యాన్ని చూసి, వారిచే పనులు చేయించుకుంటున్నందుకు అత్తుల లక్ష్మి అత్తవారింటి వారు ఎంతో పశ్చాత్తాప పడ్డారు. యతిరాజులను క్షమించమని ప్రార్థించి, దాశరథి గౌరవంగా తిరిగి పంపించారు.

శ్రీవైష్ణవుల అనుష్ఠానాల్లో ప్రధానమైన చరమ శ్లోకాన్ని (అర్థాన్ని) గ్రహించడానికి ఆచార్యులు పంపించగా వారి గురువు తిరుక్కోష్ఠియూరు నంబి వద్దకు వెళ్లారు. 6 మాసములు వారికి ఎంతో భక్తితో శుశ్రూష చేశారు. కానీ వారు తిరిగి రామానుజాచార్యుల వద్దకే పంపించారు. అప్పుడు రామానుజాచార్యులు చరమ శ్లోక (శ్లోకార్థాన్ని) ఉపదేశించారు.

శ్రీరంగ క్షేత్ర చరిత్రలో ఎన్నో చీకటి ఘడియలు చుట్టుముట్టినా అన్నింటిని అధిగమించి శ్రీరంగనాథ కోవెలను, సిద్ధాంతాన్ని కూడా పరిరక్షించి ఆ వైభవ కాంతులను ఇనుమడింపజేసిన ఘనత భగవద్రామానుజాచార్యులదే! ఆ ప్రయత్నంలో వారి శిష్యుల త్యాగము ధైర్యము కూడా స్తుతింపదగినవే!

వైష్ణవ ద్వేషి అయిన చోళరాజు యతిరాజులకు కీడు తలపెట్టి నప్పుడు మొదలి ఆండాన్‌తో పాటు భగవద్ రామానుజుల ప్రథమ శిష్యుడైన ఆళ్వాన్ (కూరేశులు) భగవద్రామానుజులకు బదులుగా చోళ రాజు రాజ్యసభకు వెళ్లగా ఆండాన్ (దాశరథి) రామానుజాచార్యులతో మేల్కోట ప్రాంతానికి వెళ్ళాడు.

శ్రీరంగం నుండి తిరునారాయణ పురానికి (మేల్కోటకు) జగదాచార్యులు శిష్యులతో ప్రయాణమయ్యారు దారిలో “మిథిలాపురి” అనే ప్రాంతంలో బస చేశారు. కానీ ఆ గ్రామ ప్రజల ఆలోచనా విధానాన్ని దుస్థితిని చూచి యతిరాజులు వారిని ఉద్ధరించ దలచారు. వెంటనే పరమ సాత్వికులు గురుభక్తి పరాయణులు, వైష్ణవ భక్తుడైన మొదలియాండాన్ని పిలిచి ఆ ఊరి జనం స్నాన పానాదులకు ఉపయోగించే చెరువు నీటిలో పాదస్పర్శను కల్గించమన్నారు. వారలాగే చేశారు. ఆమర్నాడే జనులలో పరివర్తన కలిగింది. ఆప్రభావంతో గ్రామ ప్రజలంతా విష్ణుభక్తి పరాయణులైనారు. నాటినుండి ఆ గ్రామానికి సాలగ్రామం అని పేరు ప్రసిద్ధమైనదని చరిత్ర.

అక్కడే భగవద్రామానుజాచార్యులపై పరమ ప్రీతి గల శిష్యుడు వడగనంబి (ఆంధ్ర పూర్ణులు) లభించారు. వారికి భగవంతునిపై కన్నా ఎక్కువ భక్తి ఆచార్యులపై ఉండేదట!

శ్రీపెరుంబుదూరులో గల “తాన్ ఉగంద తిరుమేని” గా ప్రసిద్ధమైన జగదాచార్యుల దివ్యమూర్తిని దాశరథి కుమారులైన కాంతాడై ఆండాన్ తయారు చేయించారని చరిత్ర. రామానుజాచార్యులు ఉన్నప్పుడే ఏర్పరిచిన ఈ అర్చా మూర్తిని వారు స్వయంగా కౌగిలించుకొని జీవ ప్రతిష్ఠ చేశారట! నేటికీ ఇక్కడ గురు పుష్యమి పర్వదినాన గొప్ప ఉత్సవం జరుగుతుంది. (మిగతా 10 వ పేజీలో)

# శ్రీపతి స్తుతి - సుభాషితం

**మంచి మాట**

## అర్చిరాది సంగ్రహం

1. అర్చిర్లోకము. 2. దినలోకము. 3 శుక్ల పక్ష లోకము, 4. ఉత్తరాయణ లోకము, 5. సంవత్సర లోకము, 6. వాయు లోకము, 7. సూర్య లోకము, 8. చంద్ర లోకము 9. విద్యుల్లోకము, 10. వరుణ లోకము, 11. ఇంద్ర లోకము, 12. బ్రహ్మ లోకము. ఈ లోకాలను దాటును.

ఇక్కడ మరొక విషయం గమనించండి. సంగ్రహం చేయాలని వరద గురువుగారు వ్రాశారు. విపులంగా పిళ్ళైలోకాచార్యులు గారు అర్చిరాది అనే రహస్య గ్రంథంలో నాలుగు ప్రకరణాలుగా విభజించి వ్రాశారు.


దానిలోని విషయాల నన్నింటిని సంస్కృతశ్లోకాలు, వాటికి తెలుగులో తాత్పర్యాలతో అతి సులభంగా గ్రహించి, కాలక్షేప యోగ్యంగా, ఇంకను గరుడ పురాణాది పురాణాలలోని విషయాలను పన్నెండు అధ్యాయాలుగా శ్రీ ఉ.వే శ్రీమాన్ శిరిశినహళ్ కృష్ణమాచార్య శతావధానిగారు 'అర్చిరాది మార్గం' అనే పేరుతో ప్రింట్ చేశారు. ఇంకా అంతిమ దేహానికి చేయు సంస్కారము అంటే శ్రీచూర్ణ పరిపాలనం'. మరణించిన దాదిగా పదమూడు రోజులు చేయవలసిన వైదిక ప్రక్రియనంతా వారు సులభ శైలిలో అందించినారు.

(గత సంచిక తరువాయి)

సంగ్రహంగా యమలోక మార్గమును, వైతరణీ నదిని దాటే ఉపాయము, ప్రతిరోజు ఏఏ కర్మలను ఆచరించాలి. యమలోకానికి ఆత్మ ఎట్లు వెళ్ళుతుంది? నరకాలెన్ని? ఎంతకాలం? మళ్ళీ ఏ జన్మ? అంటూ పాపాత్ముల ప్రాణోత్క్రమణ, పుణ్యాత్ములు వెళ్ళే ధూమ్ర మార్గం, వాళ్ళు పుణ్యలోకాలు చేరి పుణ్యం అనుభవించి మళ్ళీ జన్మకు రావడం. ఆత్మ సాక్షాత్కారాన్ని పొందిన ఆత్మోపాసకులు వెళ్ళే కైవల్యం మున్నగువాటిని సోదాహరణంగా, సప్రమాణంగా సంగ్రహంగా, సులభగ్రాహ్యంగా వ్రాశారు మాగురువుగారు.

జిజ్ఞాసువులు తమిళంలోని అర్చిరాదిని, సంస్కృతంలోని 'అర్చిరాది మార్గమును' చదివి తెలుసుకుందురుగాక.

జీవుడు అతివాహికులచే సత్కరింపబడి లీలా విభూతికి హద్దు ఐన విరజానదిలో చేరి ఆవలి గట్టు చేరు సమయంలో సూక్ష్మ ప్రకృతి గూడా తొలగిపోతుంది. అమానవ కరస్పర్శ చేత. అప్పుడు అప్రాకృత దేహం వస్తుంది. ఆదేహానికి 500 అప్సరసలు బ్రహ్మాలంకారం చేస్తారు. ఆరకంగా నిత్య విభూతియైన పరమపదం చేరి శ్రీమన్నారాయణుని దర్శించి అవాప్త కాముడై బ్రహ్మానందంలో మునిగి తనివి తీర స్వామికి కైంకర్యం (అంటే దాస్యం)



**శ్రీమాన్ శ్రీ అమరవాది వేంకటనరసింహాచార్యులు**

చేయుచు ఆనంద నిర్భరుడై ధన్యతను పొందుతాడు.

ఫలశృతి :

ప్రాతర్నిత్యాను సంధేయం, పరమార్థం ముముక్షుభిః।
శ్లోకద్వయేన సంక్షిప్తం, సువ్యక్తం వరదోబ్రవీత్॥

ప్రతిపదార్థము : ముముక్షుభిః = ప్రకృతి బంధమైన శరీరాన్ని విడిచి మోక్షము పొందాలి అనే కోరిక బలంగా గలవారి చేత, ప్రాతః = ఉదయమున, నిత్యానుసంధేయం = ప్రతినిత్యము చదువుకోదగిన, పరమార్థం = అర్చిరాది అర్థబోధకమైన మార్గమును, సువ్యక్తం = స్పష్టంగా, సంక్షిప్తం = సంగ్రహంగా, వరదః = వరదాచార్యులగారు, శ్లోకద్వయేన = రెండుశ్లోకముల చేత, అబ్రవీత్ = చెప్పిరి. పూజ్యులు గాబట్టి చెప్పెను అనకుండా చెప్పిరి అన్నాము.

తాత్పర్యం: ఈ అర్చిరాది శ్లోకాలు రెండింటిని ప్రతిరోజు లేవగానే చదువు కోవాలి. ఎందుకు? మార్గం మనకు దర్శన సమానాకారంగా కనబడే కొరకు. "ప్రాణప్రయాణ సమయే కఫ, వాత, పిత్తైః కంఠావరోధన విధౌ స్మరణం కుతస్తే" అన్నారు గదా కులశేఖరులు. అభ్యాస బలం చేత మన మనస్సు ప్రయత్నం చేయకున్నా పరమాత్మ అనుగ్రహం కలుగుతుంది. అందుకై ఈమార్గాన్ని స్పష్టంగా, సంగ్రహంగాను వరదాచార్యులుగారు అందించారు. అనుసంధించుకొండి.

(మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో)

# శుభాశుభ నిర్ణయాలు-మీమాంస

**గోవీధి ఫలము:**

శ్లో॥ వారుణోచ్చ సమాయుక్తా నీచ మాహేంద్ర సంయుతా।

గృహ నిర్మాణము కావించు స్థలముయందు పశ్చిమభాగము మిట్టగా యుండి తూర్పు భాగము పల్లముగా యున్న గోవీధి అనబడును. 'గోవీధికం నామ వాస్తు గవాం వృద్ధికృత్' గోవీధియను భూమిలో గృహనిర్మాణము చేసిన గోవులకు వృద్ధి కలుగును.

**జలవీధి:** తూర్పు భాగము ఎత్తుగా వుండి పడమటి భాగము వంపుగా యున్న స్థలమును జల వీధియందురు. 'జల వీధికం నామదారిద్ర్య కృత్' ఈస్థలమందు గృహనిర్మాణము చేసిన దారిద్ర్యము సంప్రాప్తించును,

**యమవీధి:** 'సోమోచ్చాయమనీచాచ యమ విధీతి కథ్యతే' ఉత్తర భాగము ఎత్తుగా యుండి దక్షిణ భాగము వంపుగా యున్న స్థలము యమవీధి యనబడును. దీనికి ప్రేతవీధి యని కూడా పేరు. 'ప్రేతవీధికం నామ మృత్యుకృత్' ఈ స్థలములో గృహ నిర్మాణము చేసిన మృత్యువు సంభవించును.

**గజవీధి:** యమోచ్చా సోమనీచాచ గజ వీధీతి కథ్యతే।

దక్షిణభాగము ఎత్తుగా యుండి ఉత్తర భాగము వంపుగా నున్న స్థలమును గజవీధి యందురు. 'గజవీధికం నామశ్రీగుణకరం' ఈ స్థలమునందు గృహము నిర్మాణము కావించిన ఐశ్వర్యము సుగుణ సంపత్తులు కలుగును.

**భూతవీధి:** 'ఈశోచ్చం నైఋతౌ నీచం భూతలం భూతవీధికం' ఈశాన్య భాగము ఎత్తుగా యుండి నైఋతి భాగం వంపుగా యున్న స్థలమును భూతవీధి యందురు. 'భూతవీధికం భయకృత్' ఈ స్థలమందు గృహ నిర్మాణము కావించిన యక్ష రాక్షస భూతభయములు కలుగును.

**నాగవీధి:** 'ఆగ్నేయోచ్చం వాయునీచం నాగవీధి ప్రశస్యతే'

ఆగ్నేయ భాగము ఎత్తుగా యుండి వాయవ్యభాగము వంపుగా యున్న స్థలముకు నాగభూమియని నామము. 'నాగవీధికం నాగ భయకృత్' ఈ స్థలములో గృహనిర్మాణము జరిపిన సర్ప భయములు కలుగును

**వైశ్వానరవీధి:** 'వాయూచ్చ మగ్ని నీచమద్వీధిం వైశ్వానరీం విధుః' వాయవ్యభాగము ఎత్తుగా యుండి ఆగ్నేయ భాగము వంపుగా యున్న స్థలమును వైశ్వానర వీధి యందురు. 'అగ్ని వీధికం నామాగ్ని భయకృత్' ఈ స్థల మందు గృహ నిర్మాణము కావించిన అగ్ని భయము కలుగును.

**ధనవీధి:** 'నిర్రుత్యుచ్చమీశ నీచం ధనవీధీత్యుదాహృతం' నైఋతి భాగము ఎత్తుగా యుండి ఈశాన్యభాగము వంపుగాయున్న స్థలమును ధనవీధి యందురు.



**శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి**

'ధనవీధికం నామ పుత్రపౌత్రధనదాయినీ' ఈ స్థలమందు గృహ నిర్మాణము జరిపిన పుత్ర పౌత్ర ధన ధాన్య సంపత్తులు కలుగును.

**వాస్తు భేదములు:** 1.పితామహవాస్తు, 2.సుపథవాస్తు, 3.దీర్ఘాయుర్వాస్తు, 4.పుణ్యకవాస్తు, 5.ఆపథవాస్తు, 6.రోగకృద్వాస్తు, 7.అర్గళవాస్తు. 8.శ్మశానవాస్తు, 9.శ్యేనకవాస్తు, 10.శ్వముఖవాస్తు, 11.బ్రహ్మఘ్నవాస్తు 12.స్థావరవాస్తు. 13.స్థండిలవాస్తు. 14.శాండులవాస్తు, యని 14 రకములు వాస్తులు.

వీటి గురించి వివరించుకుందాము

**1.పితామహ వాస్తు:**

శ్లో॥ ఇంద్రాగ్న్యన్తర ముచ్చం స్యాన్నీచం వరుణ వాతయోః।
వాస్తుపైతామహం విద్యాన్నరాణాం కురుతేశుభం॥

తూర్పు ఆగ్నేయ దిశలు ఎత్తుగా యుండి పశ్చిమ వాయవ్య దిశలు వంపుగా యున్న స్థలమును పితామహవాస్తు యందురు. ఈ స్థలమందు గృహనిర్మాణము చేసిన అశుభములు కలుగును.

**2.సుపథ వాస్తు:**

శ్లో॥ యామ్యాగ్న్యన్తర ముచ్చం నీచం మరుతసోమయోః।
సుపథంనామ తద్వాస్తు ప్రశస్తం సర్వకర్మణాం॥

దక్షిణాగ్నేయ దిశలు ఎత్తుగా యుండి వాయవ్య ఉత్తర

దిశలు పల్లముగా యున్న స్థలమును సుపథవాస్తు యందురు. ఈ స్థలము గృహనిర్మాణమునకు ప్రశస్తము.

**3. దీర్ఘాయుర్వాస్తు:**

శ్లో॥ సోమేశాంతరం నీచ ముచ్ఛం నిరృతి కాలయోః।
దీర్ఘాయుర్నామ తద్వాస్తు ప్రశస్తం కులవర్ధనం॥.

ఉత్తర ఈశాన్యములు పల్లముగా యుండి నైఋతి, దక్షిణ దిశలు ఎత్తుగా యున్న స్థలమును దీర్ఘాయుర్వాస్తు యందురు. ఈ స్థలములో గృహము నిర్మాణము జరిపిన వంశవృద్ధి కలుగును.

**4. పుణ్యకవాస్తు:**

శ్లో॥ ఈశానేంద్రాన్తరం నీచముచ్ఛం వరుణరక్షసోః।
పుణ్యకం నామ తద్వాస్తు ద్విజానాంచ శుభావహం॥

ఉత్తర, ఈశాన్యములు పల్లముగా యుండి నైఋతి పశ్చిమములు ఎత్తుగా యున్న స్థలమును పుణ్యకవాస్తు యందురు. ఈ స్థలము (ద్విజులు), బ్రాహ్మణులకు శుభదాయకము.

**5. ఆపథవాస్తు:**

శ్లో॥ ఇంద్రాగ్న్యోరంతరం నీచముచ్ఛం వాయు జలేశయోః।
ఆపదం నామ తద్వాస్తు వైరాయ కలహాయచ॥

తూర్పు ఆగ్నేయ దిశలు వంపుగా యుండి వాయవ్య పశ్చిమ దిశలు ఎత్తుగా యున్న స్థలమును ఆపథవాస్తు యని పిలుచుదురు. ఈస్థలములో గృహ నిర్మాణము జరిపిన వైరము, కలహములు సంభవించును.

**6. రోగకృద్వాస్తు:**

శ్లో॥ కాలాగ్న్యోరంతరం నీచముచ్ఛం స్యాద్వాయుసోమయోః।
రోగకృన్నామ తద్వాస్తు నరాణాం రోగవృద్ధి కృత్॥

దక్షిణాగ్నేయములు పల్లముగా నుండి ఉత్తర ఈశాన్య దిశలు ఎత్తుగా యున్న స్థలమును రోగకృద్వాస్తు యందురు. ఈ స్థల మందు గృహము నిర్మించిన రోగవృద్ధి కలుగును.

**7. అర్గళవాస్తు:**

శ్లో॥ నిరృత్యంతక యోర్నీచ ముచ్ఛం సోమశివాన్తరం।
అర్గళంనామ తద్వాస్తు బ్రహ్మహత్యాది కృద్భవేత్॥

నైఋతి దక్షిణములు పల్లముగా నుండి ఉత్తర ఈశాన్య దిశలు ఎత్తుగా యున్న స్థలమును అర్గళవాస్తు యందురు. ఈ స్థలము యందు గృహము నిర్మించిన బ్రహ్మహత్యాది పాప కార్యములను చేయించును.

(మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో)

★

# శ్రీరామానుజ సుధామాధురి

(7 వ పేజీ తరువాయి)

సమకాలీనులైన సన్నిధానవర్తులైన శిష్యుల యొక్క రచనల ద్వారా యతిరాజుల వైభవం, చరిత్ర గోచరిస్తాయి. దాశరథి ధాటీ పంచకం అను స్తోత్రము, రహస్య త్రయము అను గ్రంథమును రచించినట్టుగా చెప్తారు. ధాటీ పంచకం 5 శ్లోకాలు అయినప్పటికీ అందులో జగదాచార్యుల సిద్ధాంత ప్రచార వైభవం గోచరిస్తుంది. వేదబాహ్య మతాలకు మాయావాదులకు వజ్రదండంలా సిద్ధాంత విజయాన్ని వెలువరించే దండకంలా ఈ స్తోత్రము రచించబడింది. యతిరాజుల సన్నిధిలోనే ఉంటూ శ్రీరంగంలోనూ, మేల్కోటలోనూ వారి సేవలోనే తరించారు దాశరథి.

"కూరేశ ప్రథిత వాధూల దాశరథ్యాది చ్ఛాత్ర ప్రవర ముఖేన లక్ష్మణార్యః" అని యతిరాజుల శిష్యులలో కూరేశు లతోపాటు మొదలి యాండాన్ కూడా ప్రథములు, అగ్రేసరులు. రామానుజాచార్యులు (ఈ లోక పరలోక సంపదలు) ఉభయ విభూతులు ప్రసాదించగలవారు అని ఈ స్తోత్రంలో "శ్రీరంగరాజ చరణాంబుజ మూలదాసః శ్రీ విష్ణు లోక మణిమంటప మార్గదాయి" అని కీర్తించారు.

అలాగే యతిరాజుల త్రిదండాన్ని యజ్ఞోపవీతాన్ని విలక్షణంగా వర్ణిస్తూ కలికాల ప్రభావానికి కాలదండమని, కాలసూత్రమని స్తుతించారు. బ్రహ్మసూత్ర సారమైన రామానుజ సిద్ధాంతం, వారి బోధనలు కూడా కలికాల భావ లక్షణాలను తొలగింప చేస్తాయి. వేల ఏండ్లు గడిచినా శ్రీ రామానుజ మార్గము కలికాల ప్రభావానికి కాలసూత్రమై, అనుసరించే వారి జీవన కాలాన్ని సార్థకం చేస్తుంది, అంతిమ కాలంలో కాలపాశాన్ని తప్పించి మోక్ష ప్రాప్తిని కూడా కలిగిస్తుంది. అని పెద్దలు ప్రవచిస్తారు.


# భాగవతంలో భగవంతుని అవతార గాథలు

## దత్తాత్రేయ అవతారం

కార్తవీర్యార్జునుడు బయలుదేరి పోయి, దత్తాత్రేయస్వామి ఆశ్రమానికి చేరాడు. అతనికి నమస్కరించి, భక్తితో ప్రతిదినమూ అతని పాదాలు ఒత్తుతూ, మద్యమాంసాదులను ఆహారంగా తెచ్చి ఇస్తూండేవాడు. చందనం, కస్తూరి మొదలైన సమస్త వస్తువులతోనూ అతని చిత్తాన్ని రంజింపజేసే విధంగా పూజించేవాడు.

ఆ విధంగా కార్తవీర్యుడు, దత్తాత్రేయస్వామిని సేవించుకుంటూ ఉన్నాడు. ఒకనాడు, స్వామి అపానవాయువు అగ్నిహోత్రమై వచ్చి, కార్తవీర్యుని రెండు చేతులనూ కాల్చి బూడిద చేసింది. ఆ ప్రకారం స్వామి, అతన్ని ఎన్నో రకాల హింసలకు గురి చేసి, బాధ పెట్టాడు. ఐనా కార్తవీర్యుడు తన భక్తిని వదలకుండా పరమానందంతో పరిచర్యలు చేస్తూనే ఉన్నాడు. ఆ పరిచర్యల ప్రభావం చేతా, అతని భక్తి చేతా ఆయా పరీక్షల తర్వాత మునుపటి వలెనే ఉండేవాడు, కార్తవీర్యుడు.

అప్పుడు దత్తాత్రేయుడు, “ఓరీ! నేను కాంతాలంపటుణ్ని కదా, నన్నెందుకు సేవిస్తున్నావు?” అని అడిగాడు.



కార్తవీర్యుడు, “మహాత్మా! నీవు అంతఃశుద్ధి గలవాడివి. అసంగుడివి. నీవు శ్రీమహావిష్ణుమూర్తివి. ఆమె శ్రీమన్మహాలక్ష్మీదేవి” అని చేతులు జోడించి సంస్తుతించాడు.

అప్పుడు అతని భక్తికి సంతోషించి, “నీకు కావలసినది కోరుకో” అన్నాడు స్వామి.

అప్పుడు కార్తవీర్యుడు వేయి చేతులు, సమస్తభూమండలాన్నీ పరిపాలించే శక్తి, యుద్ధాలలో విజయం, సిరిసంపదలు, ధర్మతత్పరబుద్ధి, తన రథానికి కొండలు, ఆకాశం, భూమి, పాతాళం ఈ అన్ని చోట్లా ఎదురు లేకుండా సంచరించే శక్తి కోరుకొన్నాడు.

దత్తాత్రేయస్వామి అతనికి ఆ వరాలు అనుగ్రహించాడు. కానీ, “ఓరీ! నీ బాహుబలంతో నీ రాజ్యంలో అంతటా ధర్మ ప్రతిష్ఠాపన చెయ్యి. యజ్ఞయాగాలు చెయ్యి. బ్రాహ్మణులకు దానధర్మాలు విరివిగా చేస్తూ ఉండు. నా భక్తిని అన్ని చోట్లా చాటుతూ ఉండు. ఏనాడు నీవు అధర్మంగా మహర్షులను బాధిస్తావో, ఆ నాడే మరణిస్తావు!” అని చెప్పి



**శ్రీమతి తిరుమల నీరజ**

అంతర్ధాన మయ్యాడు.

అనంతబల సంపన్నుడైన కార్తవీర్యుడు, బ్రహ్మానందంతో మాహిష్మతీపురానికి వెళ్లి రాజ్యాన్ని స్వీకరించాడు. ఎంతో ధర్మబద్ధంగా తన ప్రజలను పరిపాలించాడు. ఎన్నో యజ్ఞాలు చేశాడు. మహర్షులను పూజించాడు. ధర్మస్థాపనమూ చేశాడు. అనుదినమూ దత్తాత్రేయస్వామిని పూజిస్తూ, ఆయనకు కృతజ్ఞుడై ఉన్నాడు. చిట్టచివరికి దత్తాత్రేయుడు అన్నట్లుగానే, జమదగ్ని మహర్షిని అన్యాయంగా బాధించి, ఆయన పుత్రుడైన పరశురాముని చేతిలో మరణించాడు.

ఇది ఇట్లా ఉండగా...

ఆ కాలంలోనే మదాలస - ఋతుధ్వజుల కుమారుడైన అలర్కు డనే రాజు రాజ్యం చేస్తూ, మోక్షాన్ని మించింది మరేదీ లేదని, దాన్ని పొందడానికి సత్సాంగత్యమే దారి అనీ నిశ్చయించుకొన్నాడు.

ఇతనికి ఒక అన్న ఉన్నాడు. అతడు, తన తమ్ముడు తన రాజ్యాన్ని అపహరించాడనీ, తన రాజ్యాన్ని తనకు తిరిగి ఇప్పించమనీ కోరుతూ, కాశీరాజును ఆశ్రయించాడు. అప్పటి వరకూ విరాగిగా అరణ్యాలలో ఉన్నవాడు, ఈ పని చేశాడు.

## భాగవతంలో భగవంతుని అవతార గాథలు

కాశీరాజు సైన్యాలతో అలర్కునిపై దండెత్తాడు. ఆ సమయంలో అలర్కుడూ రహస్యంగా దత్తాత్రేయుని వద్దకు వెళ్లి, శరణాగతి చేసి, తనను రక్షించమని పరమదీనంగా ప్రార్థించాడు.

దత్తాత్రేయమహర్షి అతనిని కరుణించి, "ఓ వివేకం లేనివాడా! నీవు ఎవరో తెలుసుకో. అంగాలను చింతించి, అంగిని చూసి, నిరంగుణ్ని కనుగొని, అసంగుడివై సర్వాంగాలనూ వదలివేయి!" అంటూ అతనికి తత్త్వోపదేశం చేశాడు. "ఇక విచారం ఎందుకు?" అని అడిగాడు.

అలర్కుడు సమ్యగాత్మను దర్శించి, స్వామికి వందనాలు చేసి, "నీ కృపతో బ్రతికాను. నాకు సుస్థిరజ్ఞానోపదేశం చెయ్యి" అని వేడుకొన్నాడు.

దత్తాత్రేయుడు, "మమ అనేది దుఃఖానికీ, నమమ అనేది నిర్వృత్తికీ మార్గాలు. అహంకారం అనే మొలకతో పుట్టి, మమకారం అనే మొదలు కలిగి, ఇల్లు, భూమి అనే కొమ్మలు వేసి, పిల్లలు,భార్య అనే చిగుళ్లతో అలరారుతూ, ధనధాన్యాలు అనే పెద్ద ఆకులు వేసి, పుణ్యపాపాలు అనే పూవులు పూచి, సుఖదుఃఖాలనే పండ్లు పండి, ఎంతో కాలంపాటు పెరిగి, అజ్ఞానం అనే కుదుళ్లతో నిండిపోయి, ముక్తిమార్గాన్ని కప్పేసిన మమ అనే ఈ చెట్టు నీడ లోనికి వస్తారు. ఎవరు? సంసారం అనే పథం ((దారి)లో నడుస్తూ విశ్రాంతి కోసం మిథ్యాజ్ఞాన సుఖాలకు అధీనులైన వాళ్లు. అటువంటివారికి పరమసుఖం అనేది పరమదుర్లభం. అంటే ఎంత ప్రయత్నించినా లభించదు.


కనుక, ఈ మహావృక్షాన్ని విమలవిద్య అనే పరశువుతో (గొడ్డలి), తత్త్వనిధులు, సాధుజనులు అనేవారితో కలసి ఉంటూ, ఆ సంగం అనే శిలపై గొడ్డలిని బాగా నూరి, పదును పెట్టాలి. ఆ పైన ఆ చెట్టును ఎవరు నరకుతారో, వారు చల్లని బ్రహ్మవనం లోనికి ప్రవేశించ గలుగుతారు. అక్కడ నిత్యానందంతో ఉంటూ, అపునరావృత్తిలో మళ్లీ జన్మ లేని స్థితిలో ఉంటారు" అని ఉపదేశించాడు.


అదంతా విని ఆనందభరితుడైన అలర్కుడు, "మహాత్మా! నిర్గుణ బ్రహ్మలో ఏకమయ్యే విధం తెలిపే యోగాన్ని బోధించు" అని వేడుకొన్నాడు. (సశేషం) ★

## పుస్తక పరిచయం

### శ్రీసుదర్శన శతకమ్


ప్రశస్తమైన ప్రౌఢ శైలితో గల ప్రసిద్ధమైన శక్తివంతమైన స్తోత్రం సుదర్శన శతకం. కూరనారాయణ జియ్యర్లు రచించిన ఈ సంస్కృత స్తోత్రం శ్రీవైష్ణవ సాంప్రదాయంలో ప్రధానమైనది. సంపుటీ కృత పారాయణల ద్వారా సుదర్శన హెూమాదుల ద్వారా ఆరాధనల్లో అనుసంధించే స్తోత్రం. ఈసుదర్శన శతక స్తోత్రానికి శ్రీమాన్ శ్రీ డాక్టర్ టి. పి



శ్రీనివాస రామానుజన్ సింహాచలం వారిచే ఆంధ్ర అనువాదంగా రచించబడింది. మనస్విని ప్రచురణల 60 వ గ్రంథంగా అయోధ్యలో బాల రామచంద్ర ప్రతిష్ఠ విశేషంగా శ్రీమాన్ శ్రీ విద్వాన్ డాక్టర్ కోయిల్ కందాడై వేంకట సుందరాచార్యుల చేత ప్రచురించబడింది. మంత్ర గర్భితం బీజాక్షర సమన్వితం అయిన శ్రీ సుదర్శన శతక స్తోత్ర మూల శ్లోకాలకు భావార్థాలను వివరించారు. శ్లోకాల తాత్పర్యాలను వివరిస్తూ విశేష పంక్తి వ్యాఖ్యానాలను రచించారు. మధ్యలో కొన్నిచోట్ల యంత్రాదుల సమాచారాలను పట్టికల ద్వారా వివరించారు. సుదర్శన శతక ఆవిర్భావ కథాంశం తెలిపారు. క్రమంగా సుదర్శన భగవానుని స్తుతించే మరికొన్ని స్తోత్రాలు కూడా ముద్రించారు. ఆకర్షణీయమైన సుదర్శన చక్రము గల ముఖచిత్రపు అట్టతో అయోధ్య బాల రాముని వెనుకపుట చిత్రంగా, ఆకర్షణీయంగా కూర్చిన తిరుగు పుటలతో 270 పేజీలు కలిగి బైండింగ్ తో గ్రంథం కూర్చబడింది. ప్రముఖ పండితుల మరియు గ్రంథ సహాయకుల రచయిత ముందు మాటలు ముద్రించబడినాయి. పారాయణలు, ఆరాధనలు చేయువారికే గాక విషయ ఆసక్తిపరులకు కూడా ఉపకరించే చక్కని గ్రంథము "సుదర్శన శతకం". గ్రంథము వెల 350 రూ.లు లభించు ఫోన్ నెంబర్ 94 90267511. ★

# బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవమ్



శ్రీమన్నారాయణుడిచే సృష్టికర్తగా, దిక్పాలకులుగా నియమింపబడిన బ్రహ్మాది దేవతలు అర్చామూర్తిగా నున్న శ్రీహరికి మొట్ట మొదలు చేసిన ఉత్సవమునే బ్రహ్మోత్సవముగా ఆగమ శాస్త్రగ్రంథాలు పేర్కొన్నాయి. బ్రహ్మోత్సవము మూడు నుండి మొదలుకొని 5, 9, 11 రోజులు ఇలా సాగుతుంటాయి. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనము, అంకురారోపణ, ఋత్విక్వరణం, ద్వారతోరణ మూర్తి కుంభారాధన, అగ్నిప్రతిష్ఠ, గరుడపట అధివాసం, ధ్వజారోహణం, దేవతాహ్వానం, ఎదుర్కోలు ఉత్సవం, కళ్యాణోత్సవం, వేదాశీర్వచనం, (సదస్యము) సూర్యప్రభ, చంద్రప్రభ. చిన్నశేష, పెద్దశేష, హంస, హనుమద్, కల్పవృక్ష, గజ, అశ్వ, గరుడ వాహన సేవలు, రథోత్సవములు బ్రహ్మోత్సవములలో ప్రధాన భూమికను పోషిస్తాయి. చక్రతీర్థం, శ్రీపుష్పయాగము అనునవి కూడా బ్రహ్మోత్సవములో భాగములే.



గర్భాలయము నందు ప్రతిరోజు అర్చనలను, ఆరాధనలను నైవేద్యములను అందుకునే దేవదేవుడు భక్తుల గృహాంగణములలోకి వచ్చి భక్తులందించే నీరాజనాలను నైవేద్యాలను బ్రహ్మోత్సవములలో వాహనసేవలలో వచ్చి అందుకుంటాడు.

నవగ్రహాలకు ప్రతీకలుగా సూర్య చంద్రులు, భూమి మీద పాకేవాటికి ఆదిశేషుడు, స్థావరములైన వృక్షాదులకు కల్పవృక్షము, ఆకాశంలో సంచరించే పక్షిజాతికి గరుత్మంతుడు, భూమిమీద సంచరించే జంతువులకు గజ అశ్వ, హనుమద్వాహనములు, మానవులకు రథము ప్రతీకలుగా భగవంతునికి వాహనములౌతాయి.

సర్వశేషి (అందరి సేవలనందుకునేవాడు) జగత్కారణుడు ఒక్క శ్రీమన్నారాయణుడే అయినందున ఆయనకు దేవ మనుష్య తిర్యక్ (జంతు) స్థావరములు సేవలనందిస్తూ ధన్యము లౌతాయి.

**శ్రీమాన్ శ్రీ సముద్రాల శఠకోపాచార్యులు, వరంగల్**

దేవాలయ ప్రతిష్ఠ జరిగిన నక్షత్రాన్ని (తిథి మాసాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ఆ ప్రతిష్ఠ జరిగిన రోజు కళ్యాణోత్సవం లేదా చక్రస్నానమును నిర్వహిస్తారు.

"బ్రహ్మోత్సవ నిర్వహణలో ఆచార్యుడు, బ్రహ్మ, ఉపద్రష్ట హోత, ఋత్విక్కులు, పరిచారకులు (సహాయకులు) అర్చకులు, పాచకులు (ప్రసాదాలను సిద్ధం చేసేవారు) యజమానులు, భక్తులు ఇలా అందరూ భాగస్వాములు అవుతారు.

శ్రీమన్నారాయణుడికి, శ్రీదేవి భూదేవి అమ్మవార్లకు, అనంత గరుడ విష్వక్సేనాదులకు, గోదాదేవి మొదలైన ఆళ్వారాచార్యులకు నూతన వస్త్రాలతో ఆభరణములతో పుష్ప మాలికలలో నేత్ర పర్వంగా అలంకారాన్ని చేస్తారు.

మూలమంత్రాలతో చేసే హోమాదుల వలన భక్తి శ్రద్ధలతో చేసే కళ్యాణోత్సవ, వాహనోత్సవముల వలన, వేద, ఇతిహాస పురాణ స్తోత్ర, దివ్య ప్రబంధాది పారాయణముల వలన, ఉత్సవ విశేషాలను వివరించి చెప్పే ప్రవచనాల వలన దేవాలయాలలో ప్రతిష్ఠింపబడిన శ్రీమన్నారాయణుడికి తేజో (శక్తి) విశేషము వృద్ధి పొందును. తద్వారా భక్తి శ్రద్ధలకు లోటు లేకుండా వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు జరిగే ఆలయానికి వచ్చే భక్తుల (మిగతా 15 వ పేజీలో)

**శ్రీసంప్రదాయ సేవలో**

**శ్రీభగవద్రామనుజ సిద్ధాంత**

# శ్రీఅష్టలక్ష్మీ పీఠం





శ్రీ అష్టలక్ష్మీ శ్రీనివాస పరబ్రహ్మణే నమః

శ్రీగోదాచరణమంజీర శ్రీపీతాంబరం రఘునాథాచార్య స్వామివారు 2009 సంవత్సరంలో ఆచార్యుల మంగళాశాసనాలతో శ్రీభగవద్రామానుజ సిద్ధాంత "శ్రీఅష్టలక్ష్మీ పీఠమును" విశాఖ జిల్లా అనకాపల్లి మండలం కొండకొప్పాక గ్రామం శ్రీలక్ష్మీ నారాయణనగర్‌లో స్థాపించారు.

శ్రీపీతాంబరం రఘునాథాచార్య స్వామి వారు ఏ.ఎమ్.ఏ. యల్ కాలేజిలో బి.ఏ వరకు చదువు కున్నారు. జగద్గురువులు శ్రీశ్రీశ్రీ చిన్న జీయరు స్వామివారి ప్రత్యక్ష పర్య వేక్షణలో కృష్ణాజిల్లా జగ్గయ్యపేట, కాకతీయ సిమెంట్స్ శ్రీనివాస్‌నగర్లో భారతీయ తత్వశాస్త్ర కళాశాలలో వేదాంతంలో డిప్లమా చేశారు. బ్రహ్మసూత్రాలు, తర్క శాస్త్రము, శ్రీరామాయణం, ఉపనిషత్తులు, తిరుప్పావై, స్తోత్ర పాఠాలు, శ్రీమద్భగవద్గీత, శ్రీమద్భాగవతం, తిరువాయ్ మొళి, భగవత్ ఆరాధన శ్రీశ్రీశ్రీ చిన్న జీయరుస్వామి వారు, శ్రీ మరింగంటి శ్రీరంగాచార్యస్వామివారు, శ్రీ కోనప్పాచార్య స్వామివార్ల దగ్గర గ్రంథాలను సేవించారు.

భారతీయ తత్త్వ శాస్త్ర కళాశాల కోర్సుని పూర్తి చేసుకొని మూడు సంవత్సరాలు గ్రామ గ్రామాలలో సనాతన వైదిక ధర్మ ప్రచారాన్ని నిర్వహించారు.

శ్రీశ్రీశ్రీ చిన్న జీయరు స్వామివారి ఆశ్రమంలో, సంస్థలో, సనాతన వైదిక ధర్మ ప్రచార విభాగంలో 15 సంవత్సరాలు విశేషమైన కృషి చేసి తమ ఆచార్యుల అనుగ్రహాన్ని పరిపూర్ణంగా పొందారు.

ఈ పీఠం ఆవిర్భావానికి మూల కారణమైన శ్రీశ్రీశ్రీ చిన్న జీయరు స్వామివారు బ్రహ్మయజ్ఞం చేస్తున్న శుభసమయంలో 1997 ఏప్రిల్ 20వ తేది సాయంత్రం శ్రీవిల్లిపుత్తూరులో విష్ణుచిత్తులకు శ్రీగోదాదేవి లభించినట్లు శ్రీరంగక్షేత్రంలో కావేరి నదిలో స్నానం చేస్తున్నపుడు శ్రీఅష్టలక్ష్మీ అమ్మవారి యంత్రం లభించింది.

ఆచార్యులు చూపించిన మార్గంలో నడుస్తూ శ్రీగాయత్రి మహామంత్రంలోని 24 బీజాక్షరాలు తీసుకొని, ఒక్కొక్క బీజాక్షరానికి ఒక్కొక్క ప్రాంతంలో లోక కళ్యాణార్థం శ్రీఅష్టలక్ష్మీ యాగాలు చేయాలని శ్రీమాన్ రఘునాథాచార్య స్వామి వారు సంకల్పించారు.






వీరి తల్లిదండ్రులు శ్రీపీతాంబరం వేణుగోపాలాచార్యులు. వెంకటరమణమ్మ గారలు.

ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు అనేక ప్రాంతాలలోని సుమారు 4 వేల గ్రామాలు తిరిగి సనాతన వైదిక ధర్మ ప్రచారం కావించారు.

31 ప్రాంతాలలో ఎంతో వేడుకగా ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించారు.

శ్రీ అష్టలక్ష్మీ యాగాలు ఎంతో వైభవంగా నిర్వహించారు. 2009 గజపతినగరం, విజయనగరం, 2010 కొప్పాక, అనకాపల్లి, చోడవరం, విశాఖ, 2011 బొబ్బిలి, విజయనగరం, తుని, తూర్పుగోదావరి, 2012 తణుకు, పశ్చిమ గోదావరి, 2013 ఏలూరు, పశ్చిమ గోదావరి, సింహాచలం, 2014 గుంటూరు, 2015 ఒంగోలు, శ్రీకాకుళం, 2016 రాజమండ్రి, ఖమ్మం, 2017 అనంతపురం, చింతలపూడి, 2022 జంగారెడ్డిగూడెం, 2023 మౌలాలి, హైదరాబాదు, 2024 నెల్లూరు.

2014 భద్రాచల పుణ్యక్షేత్రంలో 12 రోజులపాటు 9 కుండములతో 100 మంది ఋత్విక్కులతో శ్రీరామ మహాయజ్ఞం. పెద్దజీయరు స్వామివారి ప్రియశిష్యులు శ్రీ ఇరగవరపు రామానుజాచార్యుల మంగళాశాసనములతో భక్తుల సహకారంతో 15 వ సం॥ 22వ అష్టలక్ష్మీ యాగం నిర్వహించారు.

శ్రీ అష్టలక్ష్మీ పీఠం విశేష కార్యక్రమాలు, ఆశయాలు:

సత్సంగాలు, సేవాకార్యక్రమాలు, చేస్తూ సమాజసేవకోసం యజ్ఞయాగాదులు నిర్వహించడం, ఉభయవేదాంత సభలు, ఆర్తులకు, అనాథలకు చేయూతనివ్వడం, పిల్లలలో ఆధ్యాత్మిక సంస్కారం పెంచడం, బ్రాహ్మణోత్తములు, వేద పండితులు, అర్చకులు, ఆగమ పండిత సత్కారాలు చేయడం.

అన్ని ప్రాంత ప్రజలు, దేశం సుభిక్షంగా, ఆయురారోగ్యాలతో శ్రీఅష్టలక్ష్మీ అమ్మవారి అనుగ్రహంతో అష్టైశ్వర్యాలతో వుండాలని శ్రీపీతాంబరం రఘునాథాచార్య స్వామి చేస్తున్న కృషి, సేవ ఎంతో గొప్పది.

సేకరణ: శ్రీఅష్టలక్ష్మీ పీఠ వ్యవస్థాపకులు శ్రీమాన్ శ్రీ పీతాంబరం రఘునాథాచార్య స్వామి నుండి. ★



## బ్రహ్మాండనాయకుని
# బ్రహ్మోత్సవమ్

(13 వ పేజీ తరువాయి)

సంకల్పాలు (కోరికలు) అన్నీ ఫలవంతమవుతాయి, భక్తులకు కొంగుబంగారంగా భగవంతుడు సకలాభీష్టాలను నెరవేరుస్తాడు..

బ్రహ్మోత్సవ సమయంలో ఒకప్రక్క అగ్ని కుండములో మరో ప్రక్క కలశములో (కుంభములో) అట్లే విగ్రహములో (బింబములో) చక్రాబ్జమండలములో పరమాత్మ ఒకే సమయంలో (చతుః స్థానార్చన) నాలుగు చోట్ల ఆరాధనలను అందుకుంటాడు.

బ్రహ్మోత్సవాలలో మంత్రజపములు, నామ సంకీర్తనలు, భక్తి సంగీత కచేరీలు, భజనలు జరగడం కూడా చాలా అత్యవసరమని నిర్వాహకులు గుర్తించాలి. భక్తితో నృత్యాంజలిని, కోలాటాలను కూడా చేయవచ్చును. మంగళవాద్యాలు తప్పనిసరి. దీపాలంకరణ సేవ (సహస్ర) ఊంజల్ సేవలు కూడా నిర్వాహకుల ఉత్సాహాన్ని భక్తి శ్రద్ధలను అనుసరించి బ్రహ్మోత్సవములలో భాగము లౌతాయి.

భక్తులకు ఎక్కడా నిర్లక్ష్యం, అశ్రద్ధ, అగౌరవం, అహంకారం, మమకారం వంటివి చోటు చేసుకోకుండా నిర్వాహకులు జాగ్రత్త వహిస్తూ, సేవాభావంతో భక్తి భావంతో బ్రహ్మోత్సవాలను నిర్వహించాలి.

పేరు ప్రఖ్యాతుల కొరకు కాకుండా దాతలు తమ తమ భక్తి శ్రద్ధలను, శ్రద్ధను శక్తిని అనుసరించి ధనాన్ని విరాళంగా సమర్పించాలి. శుచి శుభ్రతలకు ఆచారము నకు సంప్రదాయములకు ప్రాధాన్యమివ్వాలి.

ఆకాశమంత పందిరి, భూదేవి అంత ముగ్గులు వేయకపోయినా అమిత పొదుపును పాటించకుండా వైభవంగా బ్రహ్మోత్సవాలను నిర్వహించుటకు సంసిద్ధులవ్వాలి.



గీతామృతం

# కృష్ణం వందే జగద్గురుం

సర్వకాల సర్వావస్థలయందును సమస్తమానవులకు జీవిత సత్యాన్ని తెలియ చెబుతుంది. జీవనగమనంలో సన్మార్గాన్ని నిర్దేశిస్తుంది. అందుకే సాక్షాత్ భగవంతుని ముఖోద్గీతమైన భగవద్గీత గీతాశాస్త్రంగా వాసికెక్కింది. గీతాసూక్తులను జీవిత సత్యాలుగా మీ శ్రీసన్నిధానంలో ఆస్వాదించండి!



**శ్రీమాన్ ఆచి వేంకట పాండురంగాచార్య**

శ్రీకృష్ణ భగవానుడు ధర్మ సంస్థాపనార్థమై ద్వాపర యుగములో భరతభూమిపై అవతరించాడు. తత్కాలీన ప్రయోజనము దుష్ట శిక్షణ, శిష్ట రక్షణతో పాటు, (యుగయుగాంతరములలో) సర్వకాలీన ప్రయోజన కారకమైన శాస్త్రమును కూడా భగవద్గీత రూపములో అవతరింపచేసాడు. సార్వకాలీన సార్వజనీన హితోపదేశము చేసినందువల్లనే శ్రీకృష్ణుడు నేటికీ జగద్గురువుగా సకలమతానుయాయుల చేత కీర్తించబడుతున్నాడు.



భగవద్గీత ఉత్తమోత్తమ ధర్మశాస్త్రము. మరియు అధ్యాత్మ శాస్త్రము. సకల శాస్త్రముల సారము. అందుకే "ఏకం శాస్త్రం దేవకీ పుత్ర గీతం" అన్నారు. ధర్మ శబ్దముతో ప్రారంభమై (ధర్మక్షేత్రే) నీతి శబ్దముతో (ధ్రువా) ముగిసినది గీత. ఇందులో ఆసాంతము మానవాళి క్షేమమునకు, అభ్యున్నతికి పాటించదగు ధర్మములు బోధించబడ్డాయి. కేవలము హిందువులకే కాక, సమస్త మానవాళికి సదా సర్వప్రయోజనకారి. సకల వేదాంతముల (ఉపనిషత్తుల) సారము భగవద్గీత. "సర్వోపనిషదో గావః దోగ్ధా గోపాలనందనః...దుగ్ధం గీతామృతం మహత్" (సర్వ ఉపనిషత్తులు గోవు, దోగ్ధా శ్రీకృష్ణుడు, ధుగ్గం (పాలు) గొప్పనైన గీతామృతము.

"గీతా సుగీతా కర్తవ్యా కిమన్యైః శాస్త్ర సంగ్రహైః"

గీతాశాస్త్రమును చక్కగా తెలుసుకొని ఆచరిస్తే మరొక శాస్త్రముతో పని లేదు. ఇందులో మానవుడు కోరుకునే చతుర్విధ పురుషార్థములైన ఇహ లౌకిక అభ్యుదయము మరియు మోక్షరూప పరమ నిశ్రేయస్సులకు ఉపాయములు, ఆచరణ పద్ధతి తెల్పబడ్డాయి.

**ఆధునిక విజ్ఞాన శాస్త్రము భగవద్గీత:**

మానవుడు ఈ సృష్టి కారణమును, పరిణామమునూ ప్రళయమునూ గురించి అన్వేషిస్తూనే ఉన్నాడు.

ఈ కనిపించే విశ్వము ఒక ఆదిమ సత్వము నుండి క్రమంగానో లేక ఒక్కసారిగానో వెలువడినదనీ, పరిమాణము పెరుగుతూనే ఉందనీ, ఒక దశలో అదే సత్వమునందు విలీన మవుతుందనీ చెబుతుంది ఆధునిక శాస్త్రము. భగవద్గీతలో శ్రీకృష్ణ

భగవానునిచే ఈ విషయము స్పష్టముగా చెప్ప బడింది. "అవ్యక్తాత్ వ్యక్తయః సర్వాః ప్రభవంతి, ప్రలీయంతే తత్రైవ అవ్యక్తసంజ్ఞకే" 8-18 అవ్యక్తమైన భగవంతుని పరా అపరా ప్రకృతి ద్వయము సకల చేతనాచేతనముల సృష్టి ప్రళయములకు నిదానము (కారణము). "నాస్తి అంతో విస్తరస్య మే" 10-19. "నాంతోస్తి మమ దివ్యానాం విభూతీనాం.."10-40. జగత్తు విస్తారమునకు అంతు లేదు. వేదాంతశాస్త్ర సారమైన భగవద్గీత మరియు ఆధునిక విజ్ఞాన శాస్త్రముల మధ్య ఏమాత్రము విరోధము లేదు.

**జగత్ ప్రవర్తనము:**

ఈ జగత్తులోని సకలప్రాణులు క్షేమప్రదముగా కొనసాగుతూనే ఉండాలి. దీనికై విశ్వ జనీన హితమును పలికింది భగవద్గీత.

"అన్నాత్ భవంతి భూతాని పర్జన్యాత్ అన్నసంభవః
యజ్ఞాత్ భవతి పర్జన్యో యజ్ఞ కర్మ సముద్భవః
కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మ అక్షర సముద్భవం
తస్మాత్ సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితం"
(3-14,15) నియతం కురు కర్మత్వం" (3-8)

ప్రతీ ప్రాణీ తమతమ విహిత కర్మలు చేస్తూనే ఉండాలి. అని భగవద్గీతలో చెప్పబడింది. "యజ్ఞములు, వర్షము, అన్నము, ప్రాణుల ఉత్పత్తి, ప్రాణుల ద్వారా యజ్ఞరూప కర్మలు అను ఈ చక్రమును పాటిస్తే లోకానికి ఉపద్రవములు లేకుండా క్షేమము కల్గుతుంది. ఈ సృష్టి నియమాన్ని పాటించకపోవడం మూలాన ఆహారకొరత ఇత్యాది అనేక సంక్షోభములు కలుగుతాయి. తద్వారా నేడు యావత్ ప్రపంచ మనుగడకే ముప్పు వాటిల్లుతున్నది.

భగవద్గీత మోక్ష శాస్త్రమే అయినా కర్మలు నిరంతరమూ శాస్త్రీయ పద్ధతిలో చేయుమనే బోధించినది. "కుర్వన్ ఏవ ఇహ కర్మాణి జిజీవిషేత్ శతగుం సమాః" అని ఈశావాస్యోపనిషత్. మానవ పరిశోధనకు, విజ్ఞాన శాస్త్రమునకు అంతుపట్టనిది ఆత్మ విషయము. దేహ ఆత్మ విషయ జ్ఞానమును స్పష్టముగా బోధించినది భగవద్గీత. జ్ఞాన సహిత కర్మాచరణలోనే మానవాళి క్షేమము ఉంటుందని అభ్యుదయాన్ని బోధించినది.

**ఆరోగ్య జీవన శైలి :**

నిరామయ పూర్వక ఆనందమయ జీవనమునకై మానవుడు అలవర్చుకోవల్సిన ఆహార నియమాదులు ఆయు, సత్వ, బలారోగ్యం, ప్రాణాయామము, ధ్యానము, స్థిత ప్రజ్ఞత ద్వారా వ్యక్తి మనో వికాసము మరియు తమతమ కర్మ నిర్వహణలో కౌశల్యము, సామర్థ్య వృద్ధి దృష్ట్యా నిస్వార్థ నిర్లిప్త కర్మాచరణ పద్ధతి ఇత్యాది విషయములు భగవద్గీతలో విస్తారముగా చెప్పబడ్డాయి.

నేడు ప్రతీ మానవుడు మానసిక ఒత్తిడికి గురికావటము, తద్వారా అనారోగ్యము పాలుకావడము మనందరికీ ప్రత్యక్షమే. భగవద్గీత బోధ ఒక్కటే దీనికి సమాధానము.

ఇందుకే యావత్ ప్రపంచమూ గీతా బోధనలను ఆదరించి ఆచరించుట జరుగుచున్నది. విశ్వములోని సకల మతములచే అంగీకృతమైనది భగవద్గీత.

**సమాజ శ్రేయస్సు - గీతాబోధ:**

నేడు సమాజము భిన్న భిన్న కుల, మత, ధనిక పేద వర్గాలుగా చీలిపోయి శాంతి, ఐకమత్యము, సామరస్యము క్షీణించినవి.

స్వార్థ బుద్ధి సమాజములో ప్రతీనిత్యము పెరిగి పోతూనే వున్నది. దీని ప్రభావము సమాజములో హింస, అశాంతి, దారిద్ర్యము ఇత్యాది రూపముల్లో కనపడుతున్నది.

సర్వ ప్రాణి కల్యాణమునకు ఆధారభూతమైన వైదిక సంస్కృతి ఒక్కటే సంపత్కర, ఆనందమయ, ఆదర్శ సమాజమును తయారుచేయగలదు. వైదిక సంస్కృతి నైతిక విలువల బోధ ద్వారా వ్యక్తిగత లాభమును కాదని సమాజ అభ్యుదయము, శ్రేయస్సునే బోధిస్తున్నది.

భగవద్గీత వైదిక సంస్కృతికి ఆయువు పట్టు. సంస్కృతి, సంస్కారములేని మానవుడు సమాజమునకు హానికారి. అంతర్గత సంస్కారయుక్త మానవ సమాజమునకు, ప్రభుత్వ శాసనాలతో పనిలేదు,

మోసము అవినీతులకు ఆస్కారమే లేదు. సంస్కార రహిత మనుష్యులను ఎంతటి ప్రభుత్వ శాసనాలు, ఆంక్షలు చక్కదిద్దలేవను విషయము ప్రత్యక్షమే కదా!

ఆదర్శ సమాజ స్థాపనకై మానవుడు ఆచరించ వలసిన అంశములు గీతలో బోధించబడినవి ఉద్దేశతః కొన్ని తెలుపబడ్డాయి. (సశేషం)

ప్రత్యేకం

# జగద్గురు వేదవ్యాస మహర్షి

(కృష్ణద్వైపాయన మహర్షి)

మన భారతీయ సనాతన ధర్మానికి మూల స్తంభం వంటివారు వేదవ్యాసమహర్షి. వేద వ్యాసమహర్షి కనుక లేక పోయినట్టయితే మనకు సంబంధించిన వేదములు కాని ఇతిహాస పురాణములు ఇతరమైన స్మృతులు అసలు మన ఆర్ష వాఙ్మయమే మనకు లభించి ఉండేది కాదు. ప్రధానంగా వేదవ్యాస మహర్షిత్వం అనేది కొంతమందికి ఒక్కొక్కప్పుడు ఏర్పడుతుంది. ఆయా కల్పములలో వారు వారు వ్యాసులుగా పరిగణింపబడతారు. వ్యాస మహర్షి అంటే ఒక్కరుగా కాకుండా అనేక మందిగా పురాణాలు కూడా చెబుతున్నాయి.

అసలు 'వ్యాస' అనేటువంటి దానికి వ్యాస పదవి అంటారు. అనగా ఇంద్రుడు, బ్రహ్మదేవుడు మొదలగు వారిని పదవులుగా మన పెద్దలు ఎలా చెబుతున్నారో అదే విధంగా వేద వ్యాసుడుగా ఉండటం కూడా ఒక పదవి అని పురాణాల ద్వారా తెలుస్తున్నది. ప్రధానంగా కృష్ణద్వైపాయన మహర్షి అనే పేరుతో ప్రసిద్ధుడైనవాడు, మహాభారతమును రచించిన మహనీయుడు, అష్టాదశపురాణములను మనకంద చేసిన వేదవ్యాసుడు సుప్రసిద్ధుడు. ఆ వేదవ్యాస మహర్షి ఆషాఢ పూర్ణిమనాడు అవతరించినట్టుగా చెప్పబడుతున్నది 'ఆషాఢ పూర్ణిమ'. అవతరించటంతోనే ఆయన పెద్దవాడయ్యాడని పురాణాల ద్వారా తెలుస్తున్నది. పరాశరమహర్షి, సత్యవతి అనే వారిద్దరికి సద్యో గర్భంతో అవతరించాడు. (గర్భం దాల్చిన వెంటనే జన్మిస్తే సద్యో గర్భం అంటారు.)

లోక సహజమైన రీతిలో జన్మించటం వేదవ్యాస మహర్షి విషయంలో కనిపించదు. పరాశరుడు, సత్యవతి ఇద్దరూ పడవలో ప్రయాణం చేస్తున్న సందర్భంలో పరాశరమహర్షి ఆమెను చూసి మోహించి కలయిక ఏర్పడగానే పరాశర మహర్షి సుతునిగా వేదవ్యాసుడు అవతరించాడు. ఆయన నల్లగా ఉంటాడు కనుక కృష్ణుడు అని, ఒకద్వీపంలో అవతరించడం వలన కృష్ణద్వైపాయనుడని పురాణాలు వర్ణిస్తున్నాయి. కృష్ణద్వైపాయనుడుగా పరాశర సత్యవతుల సుతుడుగా వేద వ్యాసుడు ప్రసిద్ధుడు.



**శ్రీమాన్ శ్రీ కె.ఇ.స్థలశాయి,** స్థానాచార్యులు

శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం భద్రాచలం

ఆయన అవతరించిన రోజు ఆషాఢ పూర్ణిమ, ఆషాఢ పౌర్ణిమను గురుపౌర్ణిమ అని కూడా చెప్తారు. ముఖ్యంగా పురాణాదులు రచించటమే కాకుండా వేదవ్యాస మహర్షి వేదములను విభజించటం జరిగింది. ఏక రూపంగా ఉండే వేదములను ఋగ్యజుస్సామాథర్వములుగాను మళ్ళీ వాటిలో ఒక్కో వేదములో కొన్ని శాఖలుగాను విభజించారు. ఋగ్వేదము కొన్ని శాఖలుగా, యజుర్వేదము 101 శాఖలుగా, సామవేదము వెయ్యి శాఖలుగా విభజించారు. విభజనము అంటే వేద గ్రంథాలు విడి విడిగా చేయడమని అర్థంకాదు.


**ఆషాఢ పూర్ణిమ నాడు వేదవ్యాస మహర్షుల వారిని పూజించాలి. గురువు అనగా వేదవ్యాసుడు మాత్రమే! ఏ సంప్రదాయం వారయినా ఎటువంటి భేదం లేకుండా వేదవ్యాసులనే గురువుగా పూజిస్తారు.**

వేదాలు శృతిగా ఉండేవి. అనగా ఆచార్యుడు చెప్పుతుండగా శిష్యుడు గ్రహించటం, దాన్ని "అక్షరగ్రహణం" అంటారు. గురువు చెప్పిన దానికి తు.చ తప్పక ఆయన ఉచ్చరించిన విధంగానే ఆ మంత్రాలను గురువుగారి ద్వారా అధ్యయనం చేయటం. అలా అధ్యయనం చేసిన వేదాన్ని తిరిగి శిష్యులకు అందించటం. ఇది అనూచానంగా వస్తున్న పరంపర.

ఆవిధమైన పరంపరలో కొంతమంది ఋషులను స్వీకరించి సామవేదంలో ఉండే వెయ్యి శాఖలలో ఒక్కొక్క శాఖకు ఒక్కొక్క వ్యక్తిని అనుకొని ఆవ్యక్తి ఆశాఖనే ప్రధానంగా అధ్యయనం చేయాలి అనే పద్ధతిని ఏర్పరచాడు.

స్వశాఖాధ్యయనం తర్వాత మిగతా శాఖలను కూడా అధ్యయనం చేసే పద్ధతిని వేద వ్యాసులే ఏర్పాటు చేశారు.

ఎందుకనగా కలియుగంలో ఉండే మానవులకు ఎక్కువగా ఆ విద్యను గ్రహించటం, ధారణ చేయటం చాలా కష్టతరం. అనే అభిప్రాయంతో ఈ ఏర్పాటు చేశారు. ఆయా శాఖా ధ్యేతలను ప్రత్యేకించి తీసుకొని ఉపదేశించి ఈ విధంగా చేయుటవలన వేదవ్యాసుడుగా పరిగణింప బడుతున్నాడని "వేదం యస్యతి పృథః కరోతి" వేదమును వేరు వేరుగా చేశారు కనుక వేదవ్యాసుడు అను పేరు ఏర్పడింది. పరాశరమహర్షికి అవతరించుట వలన పారాశర్యుడని పేరు. బదరీలో పురాణాదులు చేయటం (రాయటం) వల్ల బాదరాయణుడని అంటారు. వ్యాస మనగా విస్తరింపచేయుట, సమగ్రంగా చేయు దానిని వ్యాసము అని సూక్ష్మంగా చేయు దానిని సంక్షిప్తము అంటారు. విషయాన్ని రెండురకాలుగా చెప్పవచ్చు అలా రెండురకాలుగాను చెప్పారు కనుక వ్యాసుడని అంటారు.



విష్ణుపురాణంలో వేదవ్యాస మహర్షి గురించి ఎంతో గొప్పగా చెబుతారు,

"వేద మేకం చతుర్భేదం కృత్వా శాఖా శతైర్విభుః।

కరోతి బహుళం భూయో వేదవ్యాస స్వరూప ధృక్॥"

ఒక్కటిగా ఉండే వేదాన్ని నాలుగు భేదములుగా ఋగ్వేద యజుర్వేద సామవేద అథర్వ వేదములుగా చేయడం, ఈ వేదాలలో అనేకమైన శాఖలుగా, ఒక్కొక్క వేదములో కొన్ని శాఖలుగా చేసి వేదములను విస్తరింప చేసిన వాడు కనుక వేదవ్యాసుడు అని చెప్పారు.

"ద్వాపరే తు యుగే విష్ణుః వ్యాసరూపే మహామునిః" వేదవ్యాసమహర్షిని మామూలు మహర్షిలా కాకుండా సాక్షాత్ విష్ణువుగా చెప్పుతున్నారు. ద్వాపర యుగంలో మహా విష్ణువే వేదవ్యాసుడుగా అవతరించాడు.

"వేద మేకం స భహుదా కురుతే జగతే హితః" మహా విష్ణువే వేదవ్యాసుని రూపంలో అవతరించి గొప్పకార్యం చేశాడు. వేదవ్యాసుని కంటే పూర్వం ఈ పురాణములు బ్రహ్మదేవుని ద్వారా లోకానికి అందాయి. కర్ణాకర్ణిగా కేవలం శృతులు గానే ఉండే ఆ పురాణములనన్నింటిని గ్రంథస్థం

## జగద్గురు వేదవ్యాస మహర్షి

చేసిన మహనీయుడు వేదవ్యాసుడు. "అష్టాదశ పురాణానాం కర్తా సత్యవతీసుతః" సత్యవతి కుమారుడైన వేదవ్యాసుడు అష్టాదశ పురాణాలు రచించాడు. శ్రీమద్భాగవతాన్ని కూడా వేదవ్యాసుడే అనుగ్రహించాడు. భాగవతం కూడా అష్టాదశ పురాణాలలో ఒకటి. మహాభారతమనే ఇతిహాసాన్ని మనకంద చేశాడు. ఇతిహాసమైన మహాభారతం 'సపాద లక్ష' గ్రంథం. అనగా లక్షా ఇరవై ఐదువేల శ్లోకాలతో కూడిన మహాభారత రచన చేసిన వాడు వేద వ్యాసుడు.

ఈ విధంగా వేదవ్యాస మహర్షి మనకు గొప్ప వాఙ్మయాన్ని అందజేశాడు. వేదాన్ని అధ్యయనం చేసే యోగ్యత గల వారికి వేదాధ్యయనాన్నందించటంతో పాటుగా ఇతరులందరికీ ఉపయోగకరంగా ఉండే విధంగా పురాణరచన మహాభారత రచన గావించాడు.

వేదములలో ఉండేవే ఇతి హాస పురాణాల్లో కూడా ఉంటాయి. కనకనే వేదము ఉపబృంహ్యము అయితే వేదాన్ని వివరించే పురాణాలు, ఇతిహాసములు ఉపబృంహ్మణములు. అష్టాదశ పురాణాలు, ఇతిహాసము అందించటం వలన వేద వ్యాసుడు ఉపబృంహ్మణమునకు కర్త అయినాడు. అనూచానంగా వస్తున్న వేదమును శాఖలుగా చేసి అందరికీ ఉపదేశించి, తమ శిష్యుల ద్వారా వైదికమైన సంప్రదాయాన్ని లోకంలో కొనసాగింప చేశాడు, అందుకనే ఆషాఢ పూర్ణిమ నాడు వేదవ్యాసుల వారిని పూజించాలి. గురువు అనగా వేదవ్యాసుడు మాత్రమే! ఏ సంప్రదాయం వారయినా ఎటువంటి భేదం లేకుండా వేదవ్యాసులనే గురువుగా పూజిస్తారు. వైష్ణవులైనా, శైవులైనా, శాక్తేయులయినా, గాణా పత్యులయినా, సౌరులయినా ఎవరయినా, ఎన్ని రకాల సంప్రదాయాలు లోకంలో ఉన్నా వేద వ్యాస భగవానుణ్ని ఆషాఢ పూర్ణిమ నాడు గురు పూర్ణిమగా పూజించి వారి అనుగ్రహంతోనే జ్ఞానాన్ని పొందినట్టుగా భావిస్తారు. ఈ ఆషాఢ పూర్ణిమనాడు జగద్గురువయిన వేద వ్యాస భగవానుని పూజించి ఆయన అనుగ్రహానికి పాత్రులమవుదాము.

★

# తొండమాన్ చక్రవర్తి

## తిరుక్కోళూర్ పెణ్ పిళ్ళై రహస్యాలు

**తిరుక్కోళూర్ పెణ్ పిళ్ళై పలికిన 81 వాక్యరత్నములలోని 5వ భక్తుడైన తొండమాన్ చక్ర వర్తిని గూర్చి, పెణ్ పిళ్ళై గారు క్రింది విధముగా తెలుపు తున్నారు.**

### "పిణ మెజుప్పి విట్టేనో తొండమానై పోలే!"

తొండమాన్ చక్రవర్తి తిరుపతి సమీపాన ఉండేవారు. వారు శ్రీనివాసుని యందు పరమభక్తి కలవారు. స్వామి కూడా స్వయంగా వీరితో సంభాషించేవారు. తొండమాన్ చక్రవర్తి ఒక జన్మలో నిషాదుడుగా పుట్టాడు. నిత్యం వరాహ స్వామిని పూజించేవాడు. రెండవ జన్మలో రంగదాసుగా జన్మించాడు. మూడవ జన్మ తొండమాన్‌గా పుట్టాడు. చక్రవర్తిగా రాజ్య పరిపాలన చేసేవాడు. తొండమనాడు ప్రాంతాన్ని పాలించేవాడు. భగవంతుడు తన భక్తులకు అవకాశాన్ని కలిగిస్తారు. దానిని మనం ఉపయోగించు కోగలగాలి స్వామికి ఆనంద నిలయ నిర్మాణం గావించాడు చక్రవర్తి తొండమాను.

ఇదిలా ఉండగా కూర్మర్ అనే ఒక వైదిక బ్రాహ్మణుడు ఎప్పటి నుండో కాశీకి వెళ్లాలని తలచి, ముసలితనం చేత, లేమి చేత వెళ్ళలేక గతించాడు. అతనికి ఒక కుమారుడు కృష్ణ శర్మ అనువాడు. తండ్రి కాశి పోవాలనుకుని వెళ్ళలేదు. అతని కోరిక తిరలేదు. కనీసం తాను పోయి, కాశీలోని గంగలో అతని అస్థికలు కలపాలని తలచి, భార్యను, మూడు నెలల పసికందును తీసుకుని కాశీకి బయలుదేరగా, ఆబిడ్డను ఎత్తుకుని ఆమె నడవలేకపోయెది.

ఆమె మహా సౌందర్యవతి, పైగా మూడు నెలల పసికందుతో ఆమెను తన వెంట తీసుకు పోవుట తగదని, ఆమెను ఎవరివద్దనైనా ఉంచి తాను మాత్రం వెళ్ళి రావడం మంచిదని తలచి, ఎవరు వీరిద్దరిని కాపాడగలరు అని యోచించాడు. ధర్మప్రభువైన తొండమాన్ చక్రవర్తి దానికి సమర్థుడని, ఉదారగుణ సంపన్నుడని, ఆతని సంరక్షణలో వీరిని వదిలి వెళ్ళాలని నిశ్చయించుకున్నాడు. అంత అతనికి మనసుకు కొంత శాంతి కలిగింది వెంటనే రాజు వద్దకు వెళ్ళి ప్రార్థించగా రాజు గారు అంగీకరించారు.



**శ్రీమతి మహాలక్ష్మి రాణి గుండు, రాజమండ్రి.**

కృష్ణశర్మ నిశ్చింతగా కాశీకి వెళ్ళాడు. మహా సౌందర్యవతి అయిన కృష్ణశర్మ భార్యను, బిడ్డను, ఎత్తైన ప్రాకారాలు గల ఒక భవనంలో ఉంచి, వారికి కావలసిన వస్తు సామగ్రిని అమర్చుతూ రాజు గారు కూడా వెళ్ళి క్షేమ సమాచారాలు స్వయంగా చూసేవారు ఇలా చాలా కాలం గడిచింది. కొన్నాళ్ళకు రాచకార్య పనుల వత్తిడిలో వీరిద్దరి సంగతి రాజుగారు మర్చిపోవడం జరిగింది. కొన్నాళ్ళ వరకు తల్లీ బిడ్డా ఆకలికి వోర్చుకోగలిగారు. ఇక ఆకలి బాధకు వోర్వక యిద్దరు మరణించారు.

తరువాత కృష్ణశర్మ కాశీ నుండి తిరిగి వచ్చి రాజును తన భార్య, బిడ్డ ఎలా ఉన్నారని, వారిని పంపినట్లయిన మేము యింటికి వెళ్తాము అని అన్నాడు. వారిద్దరి విషయం రాజుగారికి అప్పుడు గుర్తొస్తుంది. రేపటి దినము వెళ్ళొచ్చు. మీరు ఇప్పుడు విశ్రాంతి తీసుకోమనగా క్రిష్ణశర్మ అంగీకరించాడు.

వెంటనే రాజు వారున్న చోటికి వచ్చి చూడగా, వారిద్దరివి అస్థి పంజరాలు కనపడ్డాయి. ఆమెను, పసిపిల్లను చంపినటువంటి బ్రహ్మహత్యా పాపం కలుగుతుంది అని రాజుకు భయంకలిగి వెంటనే వేంకటేశ్వరస్వామి వారి సన్నిధికి వెళ్ళి ప్రార్థిస్తాడు. బ్రహ్మాది దేవతలు పవళింపు చేస్తుండగా ఆనందనిలయంలో అర్ధరాత్రి అని కూడా చూడక, స్వామి వద్దకు వెళ్ళి కరుణించమని ప్రార్థిస్తాడు. స్వామి సన్నిధిలో గల పాండవ తీర్థం మహా మహిమగలది. తొండమాన్ చక్రవర్తి దానిలొ దిగి స్నానంచేసి. తాను పవిత్రుడై ఆ నీటిని (మిగతా 26 వ పేజీలో)

# శ్రీమత్ యామునాచార్యుల తనియన్

శుచౌ మాస్యుత్తరాషాఢా జాతం యామునదేశికమ్।
శ్రీరామమిశ్రచరణ సరోజాశ్రితమాశ్రయే॥
(తిరునక్షత్ర తనియన్)
యత్పదాంభోరుహధ్యాన విధ్వస్తాశేష కల్మషః।
వస్తుతాముపయాతోహం యామునేయం నమామి తమ్ ॥
(నిత్య తనియన్) శ్రీవైష్ణవ సంప్రదాయ ఆచార్య రత్నహారములో ప్రజ్వలించే పూర్వాచార్యులలో ఒకరైనవారు, సంప్రదాయానికి మూలస్తంభముగా కీర్తినొందిన శ్రీమన్నాథముల పౌత్రులు (మనవడు) అయినవారు మరియు సాక్షాత్తు ఆదిశేష అవతారులైన భగవద్రామానుజులకే పరమాచార్యులైన వారు (అంటే భగద్రామానుజుల ఆచార్యులు పెరియనంబి, ఆ పెరియనంబి గారికి ఆచార్యులు) శ్రీమత్ యామునాచార్యుల తిరునక్షత్రము ఈనెల 21 వ తేదీన జరుపుకోబోతున్నాము. సుమారు 1048 సంవత్సరాలకు పూర్వము ధాతృ నామ సంవత్సరము, ఆషాఢ శుక్లపక్ష పూర్ణిమా బుధవాసరము ఉత్తరాషాఢ నక్షత్రమునందు తమిళనాడులో కాట్టుమన్నార్ కోయిల్‌గా ప్రస్తుతము వ్యవహరింపబడుతున్న వీరనారాయణ పురములో జన్మించారు. శ్రీమన్నాథమునుల కుమారులైన ఈశ్వరముని దంపతులకు పండంటి మగ శిశువుగా భగవదనుగ్రహముతో శ్రీవైష్ణవ శ్రీ సుకృత విశేషముగా వీరు జన్మించారు. శ్రీమన్నాథముని శిష్యులలో ఒకరైన మణక్కాల్ నంబి (శ్రీరామమిశ్రులు) అనే మహానుభావులు ఈ శిశువుకు యమునైత్తురైవన్ (యామునాచార్యులు) అని నామకరణము చేయించిరి. యమునైత్తురైవన్ అంటే యమునా తీర విహారి, శ్రీకృష్ణుడు అని అర్థం. మణక్కాల్ నంబి (శ్రీరామమిశ్రులు) వారే యామునులకు పంచసంస్కారము మంత్రోపదేశము కావించిన ఆచార్యులు.

"శుచౌ మాస్యుత్తరాషాఢా జాతం" అనే తనియన్ శ్రీమత్ యామునాచార్యుల విషయముగా (ఆళవందార్ అనికూడా వీరు ప్రసిద్ధులు) చెప్పబడినది. వారి అవతార విశేషాలను తెలియచేసే తిరునక్షత్ర తనియన్ వారు అవతరించిన రోజున అనుసంధానం చేయదగినది. మరియు యత్పదాంభోరుహధ్యాన. అనే తనియన్ యామునాచార్యుల వైభవమును తెలియచేసే నిత్య తనియన్. ప్రతిరోజూ అను



శ్రీమాన్ శ్రీ డా.వోలేటి రవికుమారాచార్యులు

సంధానం చేయదగినది

తనియన్ అనగా ఆచార్యుల యొక్క (ఆళ్వార్లకు కూడా వర్తిస్తుంది) అవతార రహస్యములను, గుణములను, వైభవమును ప్రకాశింపచేస్తూ శిష్యులచేత కానీ లేదా తదుపరి కాలంలో వేంచేసిన పెద్దలచేత కానీ వ్రాయబడిన స్తుతిరూపకముగా, నమస్కారపూర్వకముగా ఉండేటటువంటి మంగళశ్లోకము. ఇట్టి తనియన్ ద్రావిడ భాషలో లేదా సంస్కృత భాషలో రచింపబడినదై ఉంటుంది. కొన్ని సందర్భములలో ఒక గ్రంథము యొక్క, గ్రంథ కర్త యొక్క, ప్రతిపాదింపబడే విషయము యొక్క (ప్రబంధ, వక్త, విషయ వైలక్షణ్యము) గొప్పతనాన్ని ప్రకాశింపచేసేదిగా కూడా ఈ తనియన్ ఉంటుంది. తని అంటే ప్రత్యేకముగా అని అర్థము. గ్రంథములో భాగం కానిది మరియు ప్రత్యేకముగా కూర్చబడినది అని అర్థము. ఉదాహరణ: తిరుప్పావై ప్రబంధమునకు పరాశర భట్టరు వారు అనుగ్రహించిన నీళాతుంగ అనే శ్లోకము.

యత్పదాంభోరుహధ్యాన తనియన్ యొక్క తాత్పర్యము: ఎవరి పాదపద్మముల ధ్యానం వలన నాయొక్క సమస్త పాపములు తొలగిపోయి, ఉనికిని పొందానో అట్టి యామునాచార్యులను నేను నమస్కరిస్తున్నాను అని పై శ్లోకమునకు అర్థము. ఆశ్చర్యమేమిటంటే ఈ తనియన్ ను కృపచేసినది సాక్షాత్తు భగవత్ రామానుజుల వారే. భజయతిరాజ స్తోత్రములో భగవత్ రామానుజులు ప్రతి యుగములో వేంచేసియున్న ప్రకారాన్ని చెప్పినటువంటి ఒక శ్లోకము ఉన్నది. "ఆదౌ జగదాధారశ్శేషః తదను సుమిత్రానందన వేషః తదుపరి ధృతహలముసల విశేషః తదనంతరమభవద్గురురేషః" (మిగతా 24 వ పేజీలో)

# జ్యోతిర్విజ్ఞానమ్



## శ్రీమాన్ శ్రీ నంబి వేణు గోపాలాచార్య కౌశిక

దశవిధ వాస్తులో స్థల, స్థాన, వర్ణ, ఆకార, ద్వార వాస్తు తరువాత. వాస్తు శాస్త్రంలో అత్యధిక ప్రాధాన్యతను సంతరించుకున్నది అలంకారవాస్తు (ఇంటీరియల్ డెకరేషన్) వాస్తులో ఇది పెద్ద భాగము. ఏ భాగములో ఏయే చెట్లు, ఏయే దిశలలో ఉండడం ద్వారా మరియు ఆ చెట్లు ఏ రోజులలో, ఏ నక్షత్రమున పెట్టడం ద్వారా ఏయే ఫలాలు కలుగును అనువిషయం మరియు శాస్త్ర ప్రకారము ఏయే వస్తువులు, బొమ్మలు, పేంటింగులు, వివిధ రకముల వాద్య సముదాయము, ఆయుధ సముదాయము, చిత్ర, విచిత్ర ఆకారములు గల పాత్రలు, అద్దములు ఏసైజులో ఉండ వలయును. ఏ ఆకారములో ఏ దిక్కులో, ఎంత ఎత్తులో ఉండ వలయును. మరియు గ్రంథాలయము ఇంటిలో ఎచట యుండవలయును, కూర్చునే కుర్చీల లాంటి ఆసనములు ఏ ఆకారములలో యుండవలయును. యజమాని ఏ దిశలో చూస్తూ కూర్చుండవలయును. వచ్చిన అథితులు ఏ ముఖముగా కూర్చుండవలయును. యజమాని స్థానము, వచ్చిన వారి స్థానములు నిర్ణయించి ఆసనములు అమర్చవలెను. ఏ దిశలో దీపములు వెలగవలెను. ఎన్ని దీపాలు వెలిగిస్తే ఉత్తమ మవుతుంది. ఏ ముఖముగా స్నాన, భోజన, జప, తప, పారాయణ హెూమములను జరుపుటకు ఆసనములను ఎలా అమర్చవలెను. లోహ వస్తువులు ఏ దిశలో యుండ వలయును. దారు కర్రతో చేయబడిన వస్తు సముదాయము ఎలా అమర్చవలయును. పింగాణీ, గాజు వస్తువులు ఎచట వుంచవలయును. క్రిస్టల్ లాంటి మెరిసే వస్తువులు ఏ స్థానమున, ఏ దిశలో ఎలా అమర్చవలయును.

విలాస వస్తువుల స్థానమేది. ఆరోగ్యమును ఇచ్చు మెడిసిన్ ఎక్కడ ఉంచవలయును. వస్త్ర, ఆభరణముల స్థానమేది. సుగంధ ద్రవ్యములు ఉంచుస్థలము. మంగళకరమైన పూజా ద్రవ్యములు ఏర్పరచు స్థలము. తయారైన తినుబండారము ఉంచు స్థలము. ఊయలను వ్రేలాడదీయు దిశ, పాదరక్షలు, గృహమును శుద్ధి చేయు చీపురు, బ్రెష్ లాంటివి ఉంచు స్థలము. వినోద భరిత వస్తువులు. టి.వి, రేడియోలను ఇత్యాదులను అమర్చు విధానము, ఇంటిలోని గోడలకు, స్తంభములకు కప్ బోర్డ్‌లలో ఏ దిశలో వస్తువులు అమర్చవలయును.

నీటివాల్పులు, ఫౌంటేన్, ఫిష్ ఎక్వేరియములు. ఏ దిశలలో అమర్చవలయును. బెడ్ రూమ్ మంచములు తల భాగము ఏ దిశలలో యుంచవలయును. ఏ దిశన బాత్రూములు. కబ్ బోర్డులు ఉంచవలెను. దైవ మందిరమున ఆరాధన పరికరములు ఎటుల అమర్చవలయును. ఏ విధమైన ఆరాధన జరిపిన, ఆరాధన విధానముల బట్టే దైవమందిరాలు విదిశలో ఆరాధనను బట్టి మూర్తులు ఎంత ప్రమాణములో యుండవలయును. ఆరాధన మూర్తి ప్రమాణము, అలంకారంగా యుంచు మూర్తి ప్రమాణము ఎలా యుండవలెను. వంటశాలలో స్టౌ, గ్రైండర్ మిక్సి, వాడే కత్తులను ఎలా అమర్చవలయును. డైనింగ్‌లో భోజనము చేసే టేబుల్, కుర్చీలు గరిటెలు, చెంచాలు, గ్లాసులు, గాజుపాత్రలు, ఫ్రిజ్ లాంటి వస్తువులు ఎలా అమర్చవలయును. హాలులలో ఏఏ డిజైనులలో స్తంభాలు, పైకప్పు, గోడలకు ఎలా అలంకరించవలయును. అందున సున్నం సిమెంటు, కర్ర, గాజు వస్త్రములను ఎలాగ అలంకరించవలెను. స్విచ్ బటన్‌లు, వెలిగే బల్బులు ఏ దిశలో వెలిగితే క్షేమం. ఏదిశలో యుండాలి. చక్కని నాదాన్ని ఇచ్చే బెల్స్, సన్నని వివిధ ధ్వనులు ఇచ్చే వస్తువులు ఏ స్థానములో ఎలా వుండవలెను.

పక్షులను పెంచుకునే వారికి వాటి వాటి స్థానములు, దిశలు ఎలా వుండాలి. గోశాలలు, డాగ్స్ (కుక్కలకు) ఏదిశలో రూములు వేయాలి. వివిధ పశు గ్రాసములు ఏవిధంగా, ఏదిశలో నిలువచేయాలి. సర్వెంట్ క్యాటరర్, రక్షకులు (గూర్ఖా) వీరికి ఏ స్థానములో వసతి ఏర్పాటుచేయాలి. రాగి, ఇత్తడి, కంచు మట్టి, కర్ర పాత్రలను దేనికి వాడాలి. దాని వలన కలుగు ఆరోగ్య, (మిగతా 26 వ పేజీలో)

# భగవంతునిపైన భారము

శరణాగతి అన్నదే న్యాసమని దానిని ఎలా చేయాలి అని వివరించుకొంటూ శరణాగతి శాస్త్రమైన శ్రీరామాయణములో ఒక్కో కాండములో ఎలా ఎవరెవరు శరణాగతిని చేశారో తెలుసుకుంటున్నాము. యుద్ధకాండలో విభీషణ శరణాగతి పూర్ణ శరణాగతి అని చూశాము. శరణాగతి అంగాలైన "అకించన, అనుకూల, అన్యవర్జిత, విశ్వాస, ప్రార్థనా పూర్వం,ఆత్మ రక్షణపరం" అన్న సమస్త పంచ అంగాలతో కూడుకున్నదీ శరణాగతి! విభీషణ శరణాగతిలో 5 అంగాలు ఎలా ఇమిడి వున్నాయో చూద్దాము!

మొట్టమొదటి అంగము "అనుకూల్యస్య సంకల్పః" పరమాత్మకు మనము మనల్ని అనుకూలురుగా మార్చుకోవడం! మసలు కోవడం! అంటే పరమాత్మకు ప్రీతికరమైన విషయాలనే మనము చేయాలి. ధర్మ మార్గములో నడచుకొనుట. "ఇదం కురు ఇదం మాకురు" అని శాస్త్రము ఒక నిబద్ధతని ఏర్పాటు చేసింది. దానిప్రకారం నడుచుకోవటం. అలా విభీషణుడు నడచుకొన్న విషయమేమిటనగా, పరమాత్మకు తన భక్తులంటే మిక్కిలి ప్రీతి. వారిపట్ల మనము ఆదరముగా నడచుకొంటే పరమాత్మకు చాలా ఇష్టం. రాములవారికి ఆంజనేయుడంటే చాలా ప్రీతి. సుగ్రీవుడితో స్నేహమునకు ఆంజనేయుడే ప్రధాన మార్గ దర్శకుడు. సీతాన్వేషణలోనూ ఆయనే సూత్రధారి. సీతాపిరాట్టి క్షేమసమాచారాన్ని రాములవారికి తెలిపినవాడు ఆయనే. సీతామాతకు అశోకవనములో రామక్షేమ సమాచారము తెలిపి సాంత్వన కూర్చినది ఆయనే! పిరాట్టి అనుగ్రహమును పొంది అగ్ని జ్వాలలవల్ల, ఎటువంటి హాని కలుగకుండా బయటపడ్డాడు.

అలా పిరాట్టి, పరమాత్మ ఇద్దరి అనుగ్రహమును పొందిన వాడు ఆంజనేయుడు. మొదట రావణ దర్బారులో హనుమను రాక్షసులు బంధించామనుకొని తీసుకొని వచ్చినప్పుడు రావణాసురుడు ఉగ్రుడైపోయాడు. హనుమ ఒక సమర్థవంతమైన దూతలా రావణాసురిడికి సీతాపిరాట్టిని రాములవారికి అప్పజెప్పేయమని హితబోధచేసాడు. రామ పరాక్రమాలను ధర్మ నిష్ఠతను "రామో నామ మహాతేజా ధర్మం పంథాన మాశ్రితః" అంటూ ఆయన బల పరాక్రమములను నీ స్నేహితుడు మహా బలపరాక్రమ వంతుడైన వాలిని "నిహతః శరేణైకేన" ఒకే బాణముతో ద్రుంచాడు అని ప్రశంసించి, నీవు ఎవరితో శత్రుత్వము పెట్టుకొన్నావో తెలుసా అని ఒకరకంగా బెదిరించాడు కూడా! దానితో రావణుడు అగ్ని మీద ఆజ్యం పోసినట్లు క్రుద్ధుడై పోయాడు. నీవసలు నారాజ్యం



**శ్రీమతి వంగల రాధిక**

లోకి రావడమే తప్పు. రావడమేకాకుండా నాపుత్రులను, జంబుమాలి, అక్షకుమారులను, పంచకసేనాపతిని, అమాత్య పుత్రుని, బంధువులను, మహా వీరులైన సైనికులను హతమార్చావు. అంతే కాకుండా నాశత్రువైన రాముని "రామో నామ మహాతేజా ధర్మం పంథాన మాశ్రితః" అంటూ నారాజ్యంలో, నాదర్బారులో ప్రశంసిస్తావా" అని నిప్పులు కురిసే నేత్రాలతో హనుమను దూషించాడు. అయినా కోపము చల్లారలేదు. "ఆజ్ఞాపయత్తస్య వధం, రావణః క్రోధమూర్ఛితః" ఆంజనేయుని హతమార్చమని తన సైనికులను ఆదేశించాడు. అప్పుడు విభీషణుడు రావణుని వారించాడు. "ఉవాచ హితమత్యర్థం, వాక్యం వాక్య విశారదః" అంటారు విభీషణున్ని వాల్మీకి. సమయాను కూలంగా మాట్లాడడంలో విభీషణుడు చతురుడు. "క్షమస్వ రోషంత్యజ రాక్షసేంద్ర" అంటూ "వధం నకుర్వన్తి పరావరజ్ఞా దూతస్య సంతో వసుధాధిపేంద్రా" దూతను సంహరించడము రాజధర్మ విరుద్ధం. "చ లోకవృత్తేశ్చగర్హితమ్" అంతేకాదు దూతను వధించడము తప్పు, ధర్మ విరుద్ధము కూడా. లోకము హర్షించదని హితబోధ చేస్తాడు. రావణుని కోపము ఇంకా ఎక్కువవుతుంది. "కపీనాం కిల లాంగూలమిష్టం భవతి భూషణం" కోతులకు తోక అంటే మహా ప్రీతి. మనము తోకమీద చేయివేసామా అంతే! విరుచుకు పడుతుంది. అందుకే ఆ తోకకు నిప్పంటించమని ఆదేశిస్తాడు రావణుడు. హిత వచనము విభీషణుడి పలుకుల వల్ల హనుమను వధించడము నివారించబడింది. హిత వచనము పలికిన

విభీషణుడంటే రామునికి ఇష్టం. ధర్మమును ఉపదేశించాడు. తన ప్రియతమ భార్య వృత్తాంతము తనకు హనుమ క్షేమంగా వున్నందువల్లనే కదా తెలిసింది! సీతామాతకి హనుమ తోకకు అగ్ని పెట్టిన వృత్తాంతము రాక్షస స్త్రీల ద్వారా తెలిసి అగ్నిని "శీతలోభవ" అని ఆజ్ఞాపించింది.

ఇలా విభీషణుడు మొదటగా రాముని బంటుని రక్షించి, అనుకూల్యస్య సంకల్పమును సాధించాడు. అంతేకాకుండా రావణుడికి పరభార్యను అపహరించడము తప్పు అనియు నీకు వేలమంది భార్యలున్నారు. నావదిన పట్టమహిషి మండోదరి ఎంతో సౌందర్యవతి, అనుకూలవతి. ఆవిడ వుండగా ఇంకా స్త్రీలోలత్వమేమిటి రాజువైన నీవే ఇలా తప్పుగా ప్రవర్తిస్తే ఇంక రాజ్యములో అధర్మము హెచ్చుమీరుతుంది. స్త్రీ కారణముగా ఎన్నోరాజ్యాలు నశించాయి. నీవు సీతా మాతను చెరపట్టినప్పటినుంచి రాజ్యంలో ఎన్నో దుశ్శకునాలు కనిపిస్తున్నాయి. నక్కలు ఊళపెడుతున్నాయి, గుడ్లగూబలు కూస్తున్నాయి, గబ్బిలాలు గుంపులుగా తిరుగుతున్నాయి. ఈ దుర్నిమిత్తాలు ఎందుకు ఏర్పడుతున్నాయో తెలుసుకో! ధర్మహీనమైన పనిచేయకు. సీతను రామునికి మర్యాదగా అప్పజెప్పేయి! అంటూ హితబోధలు చేస్తాడు. ధర్మాన్ని చెప్పాడు, రావణుడిని భేదముచేసి మాట్లాడాడు. తన వదిన గొప్పదనాన్నిచెప్పాడు, రాజ్యానికి మంచికాదు. రాజు ధర్మమును రాజ్యక్షేమమును చూడాలి. నీవుచేసే ధర్మహీనమైన ఈ పని వల్ల రాజ్యప్రజలందరు క్షోభపడవలసి వస్తుందనీ చెప్పాడు కదా ! ఇవన్నీ పరమాత్మకు ప్రీతికరమైన విషయాలు కదా! తప్పు చేసేవాడికి హితబోధచేసి, వాడిని సరిదిద్దడము పరమాత్మకు హితము. మరి పరమాత్మకు విభీషణుడు అనుకూలుడేకదా! ఆనుకూల్యస్య సంకల్పః!

" సునివిష్టం హితం వాక్యం, ఉక్తవంతం విభీషణమ్।
అబ్రవీత్ పరుషం వాక్యం, రావణః కాలచోదితః॥"

వాల్మీకిచేత ఎంతో అందంగా చెప్పబడింది. "సునివిష్టం తీయగా పలికాడు విభీషణుడు. తరువాత హితవాక్యం మంచిమాటలు పలికాడు. మంచి ఉపదేశము చేశాడు. విభీషణుడు తమ్ముడు చిన్నవాడు చెప్పాడు! రావణుడు వినలేదు. బదులుగా "పరుషం వాక్యం అబ్రవీత్" కఠినమైన పలుకులు పలికాడు. వాల్మీకి! "కాలచోదితః" అని యమునిచేత వరించబడిన రావణాసురుడు అంటారు. దుష్కర్మలు చేసేవారికి పట్టేగతి ముందే సూచిస్తున్నారు. ★

## శ్రీమత్ యామునాచార్యుల తనియన్

(21 వ పేజీ తరువాయి) అని. ఏ భగవత్ రామానుజులు అనే యతిరాజులు కలియుగములో మా గురువులుగా వేంచేసియున్నారో వారే కృతయుగమున జగత్తుకు ఆధారమైన ఆదిశేషునిగాను, పిమ్మట త్రేతాయుగములో దశరథ చక్రవర్తి పట్టమహిషులలో ఒకరైన సుమిత్రాదేవి కుమారులైన లక్ష్మణ స్వామిగాను, తదుపరి ద్వాపర యుగమున నాగలి, రోకలి ఆయుధములుగా ధరించిన బలరాములుగాను అవతరించిరి అని అర్థము.

చూశారా! ఇంతటి ప్రభావశాలి అయిన భగవత్ రామానుజులే యామునాచార్య విషయములో ఇంతటి భక్తి ప్రపత్తులను కలిగి ఎవరి పాదపద్మములను స్మరించిన మాత్రము చేత పాపములు తొలగిపోయి నేను ఒక పనికివచ్చే వస్తువుగా ఉనికిని కలిగి ఉన్నానో అటువంటి యామునులకు నమస్కరిస్తున్నాను అని అన్నారంటే! ఇక అస్మదాదులకు (మనలాంటి వారికి) భగవత్ యామునుల వైభవము ఇంత అంత అని చెప్పే సామర్థ్యము ఉంటుందా? ఖచ్చితముగా ఉండదు! కానీ స్వరూపానురూపముగా వారి వైభవాన్ని కించిత్ అనుభవించటం కేవలం "మనం ఉన్నాము" (సత్తై పెరలాం) అనే భావనతోనే!

పై తనియన్ అర్థాన్ని పరిశీలించినపుడు కించిత్ ఆశ్చర్యము కలుగుతుంది. భగవత్ రామానుజులు అంతటి వారికి పాపము ఉండటం ఏమిటి? వారు పనికివచ్చే వస్తువుగా అయ్యారు (సత్తను కలిగిన వారయ్యారు) అంటే ఏమిటి అర్థం? అనిపిస్తుంది. ఇక్కడ పాపమంటే మనం అనుకునే పాప కర్మచేసినవారు అనే అర్థం కాదు. భగదనుభవానికి అడ్డు పడేది అని గ్రహించాలి. వస్తువు అంటే జడపదార్థము కాదు "వస నివాసే" అని ధాతువు. అనగా ఉన్నది, ఉనికిని కలిగినది అని గ్రహించాలి. దీన్నిబట్టి యామునుల ప్రభావం తెలియక పూర్వం భగవత్ రామానుజులు తాము ఉన్నా లేనట్టే అనిన్నీ, యామునుల ప్రభావం తెలుసుకున్నాక సత్తను పొందినట్లు భావించారనిన్నీ తెలుస్తుంది. సాంప్రదాయాన్ని బహుముఖములుగా వ్యాప్తిచేసిన శ్రీవైష్ణవ ఆచార్యులలో యామునాచార్యులకు అతి విశిష్టమైన స్థానం కలదు. మరిన్ని విశేషాలు తదుపరి సంచికలో సేవిద్దాము. ★



# శ్రీరామాయణంలో ఉపకథలు

# సాధన - బోధన



**శ్రీమతి చక్రవర్తుల చూడామణి, ఖమ్మం**

(గత సంచిక తరువాయి)

3. పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి।
త దహం భక్త్యుపహృతం అశ్నామి ప్రయతాత్మనః॥
(9.26) నా భక్తులు భక్తితో ప్రతిఫలాపేక్ష లేకుండా సమర్పించినది ఏదైనా అది ఎంత చిన్నదైనా ప్రేమగా భక్తితో సమర్పిస్తే నేను దానిని స్వీకరించి కరువు తీరిన వాడిలాగా అంతులేని ఆనందాన్ని పొందుతాను. అని కృష్ణుడు అన్నాడు.

రాముడు శబరి ఆశ్రమానికి వెళ్ళినప్పుడు ఆమె ప్రేమతో రుచిగా ఉండే కందమూలాలు, పండ్లు, ఫలాలు సేకరించి ఇచ్చింది. ఆమె భక్తితో ఏరి ఉంచిన పళ్ళను ఎంతో ఆప్యాయంగా స్వీకరించాడు. ఒక ఆటవిక స్త్రీ ఇచ్చిందన్న చిన్న చూపు లేదు. ఆమెలో ఉన్న భక్తిని మాత్రమే చూశాడు. వాటిని తనకెంతో ఇష్టమైనవి, అపురూపమైనవి దొరికినట్లు ఆప్యాయంగా తీసుకొని తిన్నాడు. ఆమె ఎప్పటినుంచో ప్రతిఫలాపేక్ష లేకుండా కేవలం తమ ఆచార్యులు చెప్పారన్న కారణంతో చాలాకాలం రాముడి రాక కోసం ఎదురు చూసింది. తన కోసం ఎదురు చూస్తున్నదని ఎంతో ప్రేమగా పరామర్శించాడు. ప్రతిఫలాపేక్ష లేని ఆమె భక్తికి పొంగిపోయాడు.

4. లోకంలోని జీవరాసులన్నింటి మీద ప్రేమను చూపించు, దేనిని వ్యతిరేకించకు, అది మనిషైనా, మృగమైన, చెట్టయినా ఏదైనా సరే ప్రతి జీవి మీద ప్రేమను, కరుణను చూపించమని కృష్ణుడు అన్నాడు.

అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ
నిర్మమో నిరహంకారః సమ దుఃఖ సుఖః క్షమీ 12.-13
సంతుష్ట స్సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః
మయ్యర్పిత మనో బుద్ధిః యో మద్భక్త స్సమేప్రియః

12-14 కేవలం మనుష్యులను మాత్రమే కాక జీవరాశి నంతటిని ప్రేమగా చూసేవాడిని అందరూ ప్రేమిస్తారు. ఇతరులు అపకారం చేసినా అది భగవత్ప్రేరణ వలన జరిగిందని, దానికి తన పురాకృత కర్మ కారణం అని నమ్మేవారిని, ఈ జీవులన్నీ నిమిత్త మాత్రమేనని, పరాధీనులని తెలుసుకున్న వారిని, అందరూ గౌరవిస్తారు ప్రేమిస్తారు. అని కృష్ణుడు గీతలో చెప్పాడు. శ్రీరాముడు అలాగే నడుచుకుని చూపించాడు. రామాయణంలో రావణుడు చనిపోయినప్పుడు విభీషణుడు తన అన్నకు అంతిమ సంస్కారం చెయ్యనన్నాడు. అప్పుడు రాముడు మరణం దాకానే శత్రుత్వం. చనిపోయాడు కాబట్టి ఇప్పుడు అతని మీద నువ్వు శత్రుత్వం పాటించకూడదు. ఈ జీవరాశిలో అందరూ సమానం కాబట్టి రావణుడికి నువ్వు అంత్యక్రియలు చేయాలి. నువ్వు చేయకపోతే నేను చేస్తానని అన్నాడు.

అలాగే యుద్ధం అయిపోయింది, రావణుడు చనిపోయాడు. ఆకాశంలో దేవతలు వచ్చారు. 'రామా నీకు ఒక వరం ఇవ్వాలనుకుంటున్నాం. ఏం కావాలి?' అని అడిగారు. అప్పుడు యుద్ధంలో చనిపోయిన వానర జాతికి చెందిన వాళ్ళందరినీ బ్రతికించమని అడిగాడు. అలాగే విభీషణుని పిలిచి రాక్షసుల దేహాలను భద్రపరచి ఉంటే తెప్పించ మన్నాడు. వాళ్ళు చేసిన దోషమేమి లేదు. రావణుడి దగ్గర జీతం తీసుకున్నారు, అతను చెప్పిన పని చేశారు అంతే, తప్పు వాళ్లది కాదు అన్నాడు. వాళ్ళను కూడా బ్రతికించాలని కోరుకున్నాడు. రాముడు జీవరాశులలో భేద భావం చూపించలేదు.

5. త ద్విద్ధి ప్రణిపాతేన పరి ప్రశ్నేన సేవయా
ఉపదేక్ష్యన్తి తే జ్ఞానం జ్ఞానిన స్తత్వ దర్శినః 4.34

ఆత్మ యొక్క యదార్థ జ్ఞానం తెలిసిన జ్ఞానుల దగ్గరకు వెళ్ళి, సాష్టాంగ నమస్కారం చేసి, నీ సందేహాలను అడిగి తెలుసుకోవాలి. నువ్వు నిజంగా తెలుసుకోవాలన్న కొరికతోనే వచ్చావన్న విశ్వాసం కలిగించాలి. ఆచార్యులను, తత్వజ్ఞులను ఆశ్రయించి జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలి అని కృష్ణుడు చెప్పాడు. రాముడు వశిష్ఠుడు, విశ్వామిత్రుడు వంటి వాళ్ల దగ్గర విద్యాభ్యాసం చేసినవాడు. అనేక రహస్యార్థాలను ⇨

# సాధన - బోధన

తెలుసుకొని ఉన్నప్పటికీ, వనవాస కాలంలో నిరంతరం ఏదో ఒక ఋషి దగ్గర చేరి వాళ్ళ దగ్గర అనేక తత్వరహస్యాలను తెలుసుకుంటూ ఉండేవాడు. కాసేపు రాముడు కనపడ లేదంటే ఎవరో ఋషి దగ్గర ఉన్నాడు అని అర్థం. అన్నిటికీ మూలమైన ఆయనకు తెలియని విషయాలుంటాయా? అంటే ఈ లోకంలో సామాన్య మానవుడు ఎలా నడుచుకోవాలో తాను ఆచరించి చూపాడు.

6. కృష్ణుడు అర్జునుడిని చూసి 'అర్జునా కామ క్రోధాలను జయించడం చాలా కష్టం. లోకంలో శత్రువులందరినీ కూడా అస్త్ర శస్త్రాల సహాయంతో జయించవచ్చు. కానీ మనలోనే ఉండే అంతః శత్రువులను, ఇంద్రియాలను జయించడం చాలా కష్టం' అని చెప్పాడు.

"వశే హి యస్యేంద్రియాణి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా" 2.61

ఎవరైతే ఇంద్రియ నిగ్రహం కలిగి ఉంటారో వారే స్థిత ప్రజ్ఞులు. ఇంద్రియాలను శుష్కింప చేయడం ద్వారా వాటిని గెలవవచ్చు. వాటిని భగవంతుని వైపు ప్రవర్తింపజేయడం ద్వారా జయించవచ్చు. అని కృష్ణుడు గీతలో చెప్పిన విషయాన్ని రాముడు ఆచరించాడు. ఆయన ఇంద్రియాలు తన చెప్పుచేతలలో ఉంచుకున్నాడు. 'కోపం ఆహరయేత్' అంటారు. ఆయన పిలిస్తేనే కోపం ఆయన దగ్గరకు వస్తుంది. పిలవకపోతే రాదు. అంటే ఎంత నిగ్రహం ఉన్నవాడో అర్థమవుతుంది. అలాగే ఆయన ఏక పత్నీవ్రతుడు. తన భార్య సీతను విడిపోయినప్పుడు ఎంతో బాధపడ్డాడు. పరాయి స్త్రీని పొరపాటున కూడా కన్నెత్తి చూసి ఎరగడు. పరస్త్రీలను తల్లిగానే భావించాడు. ఇంకొకటి సుగ్రీవుడికి రాజ్యాన్ని గెలిచి ఇచ్చింది రాముడే. తనే గెలిచాడు, తనే ఉంచుకోవచ్చు అయినా రాజ్యం తనదే అని అనుకోలేదు. కానీ సుగ్రీవుడికి రాజ్యాన్ని అప్పజెప్పాడు. అలాగే రావణుని గెలిచింది కూడా రాముడే, అయినా ఆ రాజ్యం కావాలనుకోలేదు. విభీషణునికే ఇచ్చి పట్టం కట్టారు. కాబట్టి ఇలాగా కృష్ణుడు గీతలో చెప్పిన ఒక్కొక్క శ్లోక అర్థాన్ని రాముడు ఆచరించి చూపాడు అని అర్థం అవుతున్నది. రామాయణంలో రాముడు ఏది ఆచరించి చూపించాడో కృష్ణుడు గీతలో లోకానికి దానినే ఉపదేశించాడు. ప్రయత్నిస్తే ఇలా గీతలో ప్రతి శ్లోకాన్ని మనం రామాయణంలో అన్వయించుకోవచ్చు.

★

# జ్యోతిర్విజ్ఞానమ్

(22వ పేజీ తరువాయి)

ఆయుష్య, ఎనర్జి ప్రయోజనములేవి. ఇతరములు స్టీలు, అల్యుమినియము, ఇండోలియము, తగరము వంటి పరికరములు వాడడంలో గల ఫలితములే పైవ్రాసినవి. అలాగే ఎందుకుండాలి. అలాగే యుంటే కలిగే మంచి ఫలితము లేకున్నా వచ్చే చెడు ఫలితములను గురించి మరిన్ని శాస్త్ర విషయములను అలంకార వాస్తు ద్వారా తెలిసికుంటూ ఆయురారోగ్య, భోగభాగ్య సంపదలను పొందుదాము. ఇది చాలా సుదీర్ఘ శీర్షిక జ్యోతిర్విజ్ఞానంలో

(మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో)

★

# తొండమాన్ చక్రవర్తి

(20 వ పేజీ తరువాయి)

అస్థి పంజరాలపై చల్లగా, కృష్ణశర్మ భార్య, బిడ్డ కూడా పునర్జీవులైనారు.

స్వామి పాదాలపై పడి, క్షమించమని వేడుకుంటాడు తొండమాను చక్రవర్తి.

అనాథరక్షకుడవు, ఆపద్‌బాంధవుడవు ఈ గండం నుండి నన్ను కాపాడిన స్వామి అంటూ, అనేకవిధాలుగా స్వామిని స్తుతి చేస్తాడు. ఆమర్నాడు వారిద్దరిని, క్రిష్ణశర్మకు అప్పగించగా వారు వారింటికి బయలు దేరుతారు. ఇలా నేనేమైనా తొండమాన్ వలె భగవంతుని భక్తితో ప్రార్థించగల శక్తిగలదానిని కాదు కదా! అంటూ ముగించారు పెన్‌పిళ్ళైగారు.

"పిణ మెజుప్పి విట్టేనో తొండమానై పోలే!"

★

# భారతము పంచమవేదము

**శ్రీమాన్ శ్రీ డా. అప్పన్ కందాడై పెరుమాళ్ళాచార్యులు**



(గత సంచిక తరువాయి)

ఇంకనుఇతరదేవతల సంపర్కములేని విధముగ, విష్ణు తత్త్వమును వర్ణిస్తూ జనమేజయునకు భారతమును వివరించటానికి ప్రారంభించిన వైశంపాయనుడును

ఆద్యం పురుశమీశానం పురుహూతం పురుష్టుతమ్
ఋతమేకాక్షరం బ్రహ్మ వ్యక్తావ్యక్తం సనాతనమ్
అసచ్చ సదసచ్చైవ యద్విశ్వం సదసత్పరమ్,
పరావరాణాం స్రష్టారం పురాణం పరమవ్యయమ్,
మంగళ్యం మంగళం విష్ణుం వరేణ్యమనఘం శుచిమ్
నమస్కృత్య హృషీకేశం చరాచరగురుం హరిమ్,

ఆద్యుడు, పురుషుడు, జగత్పాలకుడు, యజ్ఞస్వరూపుడుగ యజ్ఞారాధ్యుడుగ నుతి కెక్కినవాడు, ప్రణవ (అకార) వాచ్యుడు, అంతటికన్న అన్నిటికన్న పెద్దవాడు, సృష్టిని తన శరీరముగ జేసికొని పరిణమింప జేయుచున్నవాడు, సృష్టికి బీజరూపుడు, విశ్వవృక్ష రూపుడు, (ఉపాదాన కారణము కుండకు మట్టివలె) వీటిమార్పులకు అతీతుడు, వీటిని అన్నిటిని తన సంకల్పముతో సృజించువాడు, (కుండకు కుమ్మరివలె నిమిత్తకారణము, కుండను తనకు ఉపయోగించుకొను అధికారి) దినదిన ప్రవర్ధమాన వైభవము కలవాడు, శ్రేష్ఠుడు, మంగళవస్తువు, సర్వమంగళకరుడు, విశ్వవ్యాపి, నిర్దోషి, పవిత్రుడు, చరాచరములకు యజమాని యగు హృషీకేశునకు నమస్కరించుచు గ్రంథమును ప్రారంభించెను. ఇంకను

ఓం నమో భగవతే తస్మై వ్యాసాయామిత తేజసే
యస్యప్రసాదాద్వక్ష్యామి నారాయణకథామిమామ్

యనుచు భగవత్స్వరూపులైన వ్యాసులవారికి మ్రొక్కి ఆతని కృపతో నారాయణ కథను సమగ్రముగ సేవించి ఇంత విశేషముగ చెప్పగల శక్తి గలవాడను ఐతిని అని యన్నారు. ఇంకను

సర్వశాస్త్రాభిగమనం సర్వతీర్థావగాహనం
నతథా ఫలదం లోకే నారాయణకథా యథా

సర్వశాస్త్రములను దెలసి యాచరించువాడు అట్లే సర్వతీర్థములయందు స్నాన మాచరించినవాడు పాపములను తొలగించుకొని పుణ్యములను కూడబెట్టుకుంటారు, ఐతే వీరికి పాపాలు తొలగి పుణ్యాలు లభిస్తాయి కాని పుణ్య,పాపములు తొలగి ముక్తిమాత్రము కలుగదు. మరి భారతమేమో విష్ణుకథ కనుక దీనిని విన్నవారికి పుణ్య పాపములు తొలగి ముక్తియు కలుగును గనుక వైశంపాయనులు నాస్తినారాయణసమో నభూతో నభవిష్యతి పురాణములలోబడి పరతత్త్వమును నిర్ణయించలేక తలలు బద్దలు గొట్టుకొని చివరికి

అంతః శైవం బహిః శాక్తం సభామధ్యేతు వైష్ణవమ్

అన్నట్టు ఆలోచనలో పడి వేసారి చివరన ఏదోఒక దేవతను పరత్వముగా భావించే పౌరాణికులకు నారాయణునితో సమానుడైన పరతత్త్వము లేదంటే లేదని స్పష్టముగ వ్యాసహృదయమును ఆవిష్కరించి, సర్వ దేవతలకు అధికారి ఉత్తమోత్తముడు పురుషుడు నారాయణుడని నిష్కర్ష జేసినారు. కావున భారతము స్పష్టముగ నారాయణకథయే. దీనిని గ్రంథముయొక్క ప్రారంభముననే

వాసుదేవస్య మాహాత్మ్యం పాండవానాం చ సత్యతామ్,
దుర్వృత్తం ధార్తరాష్ట్రాణాం ఉక్తవాన్ భగవాన్ ఋషిః


వాసుదేవుని మాహాత్మ్యమును, పాండవుల సత్ప్రవర్తనను, బాహ్యముగనేకాక మానసికముగను సర్వాత్మనా అంధుడగు ధృతరాష్ట్రునియొక్క సంతతియగు కౌరవుల దుష్ప్రవర్తనలను, ఋషి వ్యాసుడు స్పష్టముగ యోగమున దర్శించి వివరించెను. అనుచు వీటిలోను వాసుదేవుని మాహాత్మ్యమును ముఖ్యమైనదానిగా చేసుకొని నేను మహాభారతమును వచించెదను అని వైశంపాయనుడు కథను ప్రారంభించెను. ఇట్లు వాసుదేవ కథ స్వరూపముగ గలదై భారతకథ ప్రారంభమైనది.

# వాల్మీకి చూసిన హనుమంతుడు

**-యువతకు ఆదర్శం హనుమంతుడు**



శ్రీ రామాయణం మొదటి కావ్యం కదా! వాల్మీకి మహర్షి మొదటి కవి అంటున్నాం కదా! మరి ఆ మొదటి కావ్యంలో వాల్మీకి మహర్షి హనుమంతుడిని ఎలా చూసివుంటాడు. ఎలా చిత్రించి ఉంటాడు. మనం మన మాటల్లో కాస్త ఆలోచిద్దాం! ఇవ్వాళ హనుమంతుడిని భక్తాంజనేయుడిగా, దాసాంజనేయుడిగా, వీరాంజనేయుడిగా ఆరాధిస్తున్నాం. కాని వాల్మీకి ఆలోచనలో పుట్టిన హనుమంతుడు లేదా అంజనేయుడిని ఎలా భావించాడు. మనకు రామాయణ కావ్యంలో మొదటి మూడు కాండల్లో హనుమంతుడి ప్రస్తావన రాదు. మరో మూడు కాండల్లో అంటే కిష్కింధ కాండ నుండి యుద్ధ కాండ వరకు ఉన్న మూడు కాండల్లో హనుమంతుడి పాత్ర, హనుమంతుడి విరాట్ స్వరూపం కన్పిస్తుంది. కిష్కింధకాండలో కన్పించాడు.



సుందరకాండలో విశ్వరూపాన్ని చూపించాడు. యుద్ధ కాండ ముగిసే వరకు అంటే శ్రీ రామపట్టాభిషేకం జరిగే వరకు రామాయణం కథ హనుమంతుడి చుట్టూ తిరుగుతుంది.

**శ్రీమాన్ శ్రీ డా ఆచార్య వేణు**

శ్లో॥ అంజనా నందనం వీరం జానకీ శోకనాశనం।
కపీశం అక్షహంతారం వందే లంకా భయంకరమ్॥

అంజనాదేవి కుమారుడైన హనుమంతుడు సీతాదేవి శోకాన్ని నాశం చేశాడు. అతడు వానర వీరులకు నాయకుడు. అక్ష కుమారుణ్ణి సంహరించి లంకను భయంతో ముంచెత్తాడు. సుగ్రీవుని మనసులో ఉన్న భయాలను పోగొట్టి చక్కటి నివారణోపాయాలు కూడా చూపించాడు. అది కూడ సుగ్రీవుడికి కోపం తెప్పించకుండా నీకంటే తెలివికలవాడిని అన్న భావం మాటలో చూపులో కన్పించకుండా ఉన్న పరిస్థితిని విశ్లేషించి చెప్పి కర్తవ్య బోధ చేశాడు.

అది నా పని కాదులే ఇంతమంది మంత్రులుంటే నేనే ఎందుకు సలహా చెప్పడం అని హనుమంతుడు అనుకోలేదు. తన రాజ్యం యొక్క మంచిని కోరి బాధ్యతను తన భుజాలమీద వేసుకున్నాడు.

మంచి వ్యక్తిత్వానికి అవసర మైన లక్షణం బాధ్యతను చేపట్ట గలగడం, బాధ్యతను తప్పించుకోవాలనేది బానిస మనస్తత్వం. ఎవరినో ఉద్యోగం ఎలా ఉంది అని అడిగితే ఉద్యోగం బాగా నచ్చింది కాని పని చెయ్యడమే బహుకష్టంగా ఉంది అన్నాడట. అందరూ గొప్పగొప్ప ఉద్యోగాలు కావాలని కోరుకుంటారు అవి ఎలా వస్తాయి. గొప్ప వ్యక్తులు కావాలని అందరూ అనుకుంటారు. ఎలా అవుతారు. మనకు నచ్చిన

# వాల్మీకి చూసిన హనుమంతుడు

పనిని కూడా చెయ్యడానికి వచ్చేసరికి ఏడుస్తూ ఎందుకు వచ్చిందిరా భగవంతుడా అన్నట్లు నిరాసక్తితో చేస్తాం.

ఎవరైతే తాను నెరవేర్చ వలసి వచ్చిన బాధ్యతను సంతోషంగా భుజాలకెత్తుకొని సక్రమం చేస్తూ ముందుకు పోతారో వారే వికాసాన్ని పొందుతారు. వారికే ఇంకా ఇంకా గొప్ప బాధ్యతలు అప్పగించ బడతాయి. ఈ లక్షణాన్ని హనుమంతుడి నుండి మనం నేర్చుకోవాలి

**మాట్లాడటం ఎలాగో నేర్చుకోవాలి:** హనుమంతుడి నుండి మాట్లాడటం అనే సంస్కారాన్ని అందిపుచ్చుకోవాలి. నిత్యజీవన వ్యవహారంలో మన పనులు సాధించుకోవాలన్న, మనకు మంచి పేరు రావాలన్నా, మనం ఇతరులతో మాట్లాడే విధానాన్ని బట్టే ఉంటుంది. మనకో సుభాషితం కూడా పెద్దలు చెప్పారు.

శ్లో॥ జిహ్వాగ్రే వర్తతే లక్ష్మీః జిహ్వాగ్రే మిత్ర బాంధవాః।
జిహ్వాగ్రే బంధన ప్రాప్తిః జిహ్వాగ్రే మరణం ధృవం॥

తే.గీ. వాక్కుకున్న శక్తి వాడి కత్తికి లేదు
మార్చగలదు మాట మనిషి మనసు
జార వలదునోరు జాగ్రత్త జాగ్రత్త
శబ్దములకు గొప్పశక్తి కలదు

లోకంలో అత్యంత విలువైన భూషణం అలంకారం మాట, అలాంటి అలంకారము, ఆభరణం విలువ మనం హనుమంతుడి నుండి నేర్చుకోవాలి. కలిసి పని చేయగలగాలి.

సీతాదేవిని వెతకడానికి సుగ్రీవుడు వానరులను నాలుగు దిక్కులకు పంపాడు. దక్షిణ దిశగా హనుమంతుడితో పాటు నీలుణ్ణి, గజ, గవయ, గవాక్ష, సుషేణ, వృషభ, మైంద, ద్వివిద, విజయ, గంధమాధవ, ఉల్కాముఖ, అంగద, జాంబవంతున్ని పంపారు.

దక్షిణం వైపు వెళ్ళే సేనకు నాయకుడిగా అంగదుడిని నియమించారు. ముప్పై రోజులలో తిరిగి రావాలని గడువు విధించాడు.

హనుమంతుడు చూపిన నైపుణ్యం, చొరవ, సమయస్పూర్తి కార్యదక్షత, ఇవన్ని హనుమంతుడి వ్యక్తిత్వాన్ని మనకళ్ళకు కట్టినట్లు చూపుతాయి.

**బయటి నుండి లభించే సాయం.**

వానరులు బయలు దేరి వెళుతుంటే సంపాతి మాటలు. "ఓ వానరవీరులారా మీకోసం ఎదురు చూస్తూ ఇక్కడ ఉండమని నన్ను నిశాకర మహర్షి ఆజ్ఞాపించాడు. ఆ మాటల ప్రకారం మేము మిమల్ని కలిశాము, మీరు తప్పక సీతాదేవిని దర్శిస్తారు. ఈ సముద్రాన్ని దాటి లంకకు చేరితే మీకు సీత జాడ తెలుస్తుంది." అని సంపాతి చెప్పాడు.

**ఒదిగివుండే గుణం.**

సుగ్రీవుడి మంత్రిగానే హమమంతుడు తన జీవితాన్ని కొనసాగించాడు. వానరులందరిలో తానే గొప్పవాడైనప్పటికి ఎన్నడు తాను రాజు కావాలని కోరుకోలేదు. మంత్రిగా తన విధుల్ని అత్యున్నతంగా భావించి నిర్వహించాడు.

ఎవరైతే తక్కువ స్థాయి పని చేస్తాడో వాడు తక్కువ మనిషి కాడు. ఒక మనిషిని కేవలం అతడు చేసే పని యొక్క స్వభావాన్ని స్థాయిని బట్టే అంచనా వేయడానికి వీలు లేదు. తమ పనుల్ని ఎలా సమర్థంగా ఎంత స్ఫూర్తి మంతంగా చేస్తారన్న దాన్ని బట్టి వారిని అంచనావేయాలి. ఇది హనుమంతుడి నుండి నేర్చుకోవాల్సిన మరో గుణం.

ఇలా రామాయణంలో వాల్మీకి హనుమంతుడిని కొన్ని కొన్ని ముఖ్యఘట్టాలలో చూపించాడు. తర్వాత కాలంలో హనుమంతుడిని రామ భక్తుడిగా చూపుతున్నాం. ★

శ్రీసన్నిధానం పత్రిక ఇక మీ ఇంటికి వస్తుంది. వెంటనే మీ పోస్టల్ అడ్రస్ ఈ క్రింది నంబరుకు పంపి మెంబర్ షిప్ తీసుకోండి. అత్యధిక పండితుల మంగళాశాసనాలతో అత్యధిక పాఠక ఆదరణ పొందుతున్న ఏకైక తెలుగు ఆధ్యాత్మిక మాస పత్రిక శ్రీసన్నిధానం. మీరూ భాగస్వాములు కండి. మొబైల్ నంబర్
95025 83323

# పద్దెనిమిది రహస్యములు

తిరుక్కోటియూరు నంబిగారు ఉపదేశం ఇచ్చుటకు భగవద్రామానుజులవారిని పదునెనిమిది పర్యాయములు తమ గ్రామానికి త్రిప్పారట! ఒక్కొక్క పర్యాయము ఒక్కొక్క అర్థవిశేషమును సాయించారు.

అవి యేమిటో తెలుసుకుందాం!

1) ముముక్షువైనవారికి మొదట సంసారబీజము నశించాలి. (మోక్షం కోరే వారికి సంసార వ్యామోహం ఉండరాదు) అది ఎటుల నశించుననగా

శ్లో॥ పంకాదుత్పత్తి తే కీటం కీటం పంక న సత్యతే।
లోకా దుత్పత్తి తే జ్ఞానీ జ్ఞానీ లోకం న పత్య తే॥

అని తెలిపినట్లు కుమ్మరిపురుగు బురదలో పుట్టి బురదలోనే యుండును. అయినను దానికా బురద అంటదు. అట్లే జ్ఞానియైనవాడు కర్మవలననే పుట్టుచున్నాడు. కాని కర్మను అంటనివ్వకుండగ సంసార బీజమును నశింప జేసుకోవాలి.

2). సంసారబీజము నశిస్తేనేగాని అహంకార మమ కారములు నశించవు. అహంకార మమకారములు నశించుట. ఎట్లనగా,

అహంకార మనగా గర్వము మమకార మనగా మాత్సర్యము. అగ్నివల్ల పుట్టినదీపము చల్లనైనగాలిచే శాంతించునట్లు అహంకార మమకారముల నివృత్తి కలుగాలి.

3). అహంకార మమకారములు నివర్తిస్తేనేగాని దేహాభిమానము పోదు.

4). దేహాభిమానము పోతేనే గాని ఆత్మజ్ఞానము ఉద్భవించజాలదు,

5). ఆత్మజ్ఞానము సముద్భవిస్తేనే గాని ఐశ్వర్యభోగాదుల యందు ఉపేక్ష జనించదు,

6). ఐశ్వర్యభోగాదులయందు ఉపేక్ష జనిస్తేనేగాని భగవంతునియందు ప్రేమ కలుగదు.

7). భగవంతుని యందు ప్రేమ అంకురిస్తేనేగాని విషయాంతరముల యందు (ఇతర విషయాలపై) రుచిపోదు.

8). విషయాంతరముల యందు రుచి పోతేనే గాని పారతంత్ర్యము సిద్ధించదు.

9). పారతంత్ర్యము సిద్ధిస్తేనేగాని అర్థ, కామ, రాగ, ద్వేషాదులు పోవు.

10). రాగ ద్వేషాదులు పోతేనే గాని "శ్రీ వైష్ణవత్వము" లభించదు.

11). శ్రీవైష్ణవత్వము చేజిక్కితేనే గాని సాత్విక పరిగ్రహణ తటస్థించదు,

12). సాత్విక పరిగ్రహణ తటస్థించితేనే గాని భాగవత పరిగ్రహణకు (స్వీకరించటం) అవకాశము లేదు,



**శ్రీమాన్ శ్రీ నెల్లుట్ల దత్తాత్రేయ స్వామి**

13). భాగవత పరిగ్రహణ అయితేనే గాని భగవంతుని పరిగ్రహణ కలుగదు.

14). భగవంతుడు పరిగ్రహిస్తేనేగాని అనన్య ప్రయోజనుడు కాజాలడు.

15). అనన్య ప్రయోజనుడు (భగవంతుడు తప్ప వేరే ప్రయోజనం లేనివాడు) అయితేనే గాని అనన్యార్థ శేషభూతుడు కాడు, (భగవంతునికే చెందినవాడు)

16).. అనన్యార్థ శేషభూతుడు అయితేనే గాని అనన్యశరణుడు కాజాలడు.

17). అనన్యశరణుడు అయితేనేగాని అధికారి పురుషుడు కాలేడు.

18). అధికారి పురుషుడైనవానికి తిరుమంత్రార్థము లభిస్తుంది. అని ఒక్కొక్క ప్రయోజన సిద్ధి పొందుతూ

ఈ విధముగా పదునెనిమిది పర్యాయములు వేంచేసిన భగవద్రామానుజుల వారికి పద్దెనిమిది రహస్యములను తిరుక్కోటియూరు నంబిగారు సాయించారు అని చరిత్ర

ఆవిధంగా తాను నేర్చిన రహస్య సారమగు మంత్రార్థ మును దయాసముద్రుడై సామాన్యులకు కూడా అందించి జగద్గురువులయినారు రామానుజుల వారు.


# గోసేవ

శ్రీమతి.మామిడిపల్లి రాజ్యలక్ష్మి, M.A.M.phil



సేవ చేయడానికి ఆస్తులు అంతస్తులు అవసరం లేదు స్పందించే గుణం ఉంటే చాలు. ప్రతి వ్యక్తి అంకిత భావంతో సేవా నిరతితో తమ వంతు కర్తవ్యంగా తాము ధర్మాన్ని ఆచరిస్తూ, రాబోయే తరాలకు కూడా సేవా దృక్పథం అలవరచ వలసిన ఆవశ్యకత ఎంతో ఉంది.

చతుష్పాద జంతువులన్నింటిలో ఆవు ఎంతో ఉత్కృష్టమైనది. ఋగ్వేదంలో చెప్పబడినట్లు" గావో విశ్వస్య మాతరః " అనగా గోవు ఈ విశ్వానికే తల్లి వంటిది, అనాదిగా యజ్ఞ యాగాదులలో, గృహప్రవేశాదులలో గోవును ఆహ్వానించడం మనం ఆచారంగా చూస్తూనే ఉంటాం! "గంగిగోవు పాలు గరిటడైనను" అన్నట్లుగా పంచామృతాలలో మొదటిదిగా చెప్పుకునేది గోక్షీరం. ఔషధ సేవలో కూడా ఆవుపాలను వాడడమే శ్రేష్ఠము అనే విషయం మనకు విధితమే!



మన దేశంపై జరిగిన సాంస్కృతిక దాడులలో కొంత మేరకు గోశాలల ప్రాముఖ్యత తగ్గిందనే చెప్పవచ్చు. గోమాతను సేవించడం పరోక్షంగా భూమాతను సేవించినట్లే అవుతుంది. ఎందుకంటే గోమూత్రము గోవు పేడ వంటివి మన పంటలలో సేంద్రియ ఎరువుగా వాడటం వలన పండించే పంటలతో ఆరోగ్య పరమైన సమాజము నిర్మితమవుతుంది. పర్యావరణం రక్షింపబడుతుంది. ఇలా లౌకిక ప్రయోజనాలతో పాటు ఆధ్యాత్మిక వైదిక వాతావరణం కూడా నెలకొంటుంది.

సముద్ర మథనంలో ఆవిర్భవించిన కామధేనువు గోమాతగా పేరుపొందింది. గోమాతను పూజిస్తే సకల దేవతలను పూజించినట్లే!

శ్రీకృష్ణుడు బాల్యంలో గోసేవ చేసినట్లు గోవులను రక్షించినట్లు సాక్షాత్ భగవంతున్ని భాగవతంలో మనం గోపాల బాలకుడిగా దర్శిస్తాము.

రామాయణంలో కూడా విశ్వామిత్రుడు బ్రహ్మర్షి కావడానికి కామధేనువే ప్రధాన కారణం అయిందని తెలుస్తున్నది. ప్రహ్లాద ఉపాఖ్యానంలో

"శుద్ధ సాధువు లందు, సురలందు గోవులందు విప్రకోటి యందు" అన్నచోట సాధువులను, వేదాలను, విప్రులను, గోవులను పీడించిన వారిని నిష్కర్షగా శిక్షిస్తానని స్వయంగా శ్రీమన్నారాయణుడే చెప్పడం జరిగింది. అందుకే గోమాతను అంత పవిత్రంగా పూజిస్తాము. జ్యోతిష్య శాస్త్ర ప్రకారంగా గోధూళి లగ్నం అని ప్రత్యేకంగా ఉంటుంది. విశిష్టతల దృష్ట్యా చూస్తే ఉత్తరాదిన ఉన్నట్లు దక్షిణాదిన కూడా ఇంకా గోశాలల అభివృద్ధి జరగాలి. గోరక్షణ పోషణ నిర్వహణ కొరకై శారీరక శ్రమతో పాటు గోగ్రాస సమీకరణ, పూజలు, గోష్ఠములలో హోమములు నిర్వహించడం లాంటి వాటికై మన శక్త్యానుసారముగా సేవలను అందించడం ద్వారా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుంది.

"గో ప్రదక్షిణం భూప్రదక్షిణతో సమానం" అని గో సేవ, పూజల వల్ల ఈ జన్మకే కాక గత జన్మ పాపాలను కూడా తొలగించుకోవచ్చని శాస్త్రాలు వక్కాణిస్తున్నాయి. గోమాత యొక్క పవిత్రతను వేద శాస్త్ర పురాణాదులు ఎన్నో రకాలుగా వివరించాయి. దోష పరిహారాలకు పుణ్య పర్వ దినాల యందు గోదానములను నిర్దేశించాయి. ఎన్నోదేవాలయాల్లో ప్రభాత సేవలలో దేవాలయంలోకి ప్రవేశపెట్టి గోమాత పృష్ఠ భాగాన్ని భగవంతునికి అభిముఖంగా ఉంచి గోపూజ చేస్తారు.

పవిత్రమైన ఈ సంస్కృతి మరుగున పడకుండా గోవృద్ధి గోశాలల పోషణ, గోఉత్పత్తుల వాడకం, గోసేవను ఆచరిస్తూ అందరూ సత్ఫలితాలను పొందాలి. ★

# "స్వయం మరియు సమాజం కోసం యోగా"





భారత సంస్కృతికి అద్దం పట్టే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రథమంగా ప్రతిష్ఠాత్మకంగా 2015 జూన్ 21న న్యూఢిల్లీ లోని రాజ్ పథ్ లో భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో నిర్వహించారు. 2024 జూన్ 21న పదవ అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించుకున్నాము. శారీరక మానసిక ఆరోగ్యప్రదాయనిగా ఆధ్యాత్మిక జ్ఞానప్రదాతగా సత్ఫలితాలనిచ్చే "యోగా" సాధన మానవజాతికే క్షేమకరమైనది.

వైదిక సంస్కృతిలో అన్ని రకాల సాధనల్లోనూ అష్టాంగ యోగము ప్రధానమైనది. యమ నియమాది ఎనిమిది అంగాలు కలిగినది అష్టాంగ యోగం. అందులో ప్రధానంగా ఆధునిక కాలంలో సాధన చేయబడేవి ఆసనం, ప్రాణాయామము, ధ్యానం మాత్రమే. "యోగా" అంటే బాహ్య అంతర్శుద్ధికి చేసే శాస్త్రబద్ధమైన సాధన అని కూడా వివరిస్తారు. యోగ సూత్రాలను మనకందించిన పతంజలి మహర్షి "యోగ చిత్తవృత్తి నిరోధః" అని నిర్వచించారు. చంచలమైన మనసును బుద్ధిని అధీనంలోకి తెచ్చుకొని ఏకాగ్రతను సాధించి, శరీరాన్ని (ప్రకృతి చర్యల నుండి) స్వాధీనంలో ఉంచుకోవడం యోగ అని నేటి కాలంలో భావిస్తున్నారు.


అనేకమంది సాధకులు ధ్యానం ఏకాగ్రతలను అనేక రకాలుగా వివరిస్తున్నారు. యోగశాస్త్రంలో చెప్పబడ్డట్టుగా ఎన్నో ఆసనాలను అభ్యాసం చేయించడం జరుగుతున్నది. నేటి కాలంలో అనేకమంది గురువులు సాధకులు సంస్థలు కూడా యోగాసనాది విషయాలపై శిక్షణ ఇస్తున్నారు. ముఖ్యంగా యోగాసనాల్లో శారీరక అవయవాలను స్వాధీన పరుచుటకు చేసే విడివిడి ఆసనాలే కాకుండా సూర్య నమస్కారములు ముఖ్యమైనవి. ద్వాదశ సూర్య నామాలను ఉచ్చరిస్తూ ద్వాదశ భంగిమల్లో సాధన చేస్తారు.

"స్వయం మరియు సమాజం కోసం" అనే లక్ష్యంతో 2024 పదవ యోగా దినోత్సవం జరుపుకున్నాము.

శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శ్రేయస్సు పైన ప్రభావాన్ని చూపిస్తూ వ్యక్తిగత సామాజిక క్షేమానికి దోహదం చేసే "యోగా" ప్రతి ఒక్కరూ అభ్యాసం చేయాలని "అంతర్జాతీయ యోగా దినోత్సవం" తెలియజేస్తున్నది.







ఆండాళ్ దేవి అనుగ్రహించిన కొమళ్ళ


# శ్రీవేణుగోపాలస్వామి



సేకరణ: దరిపల్లి సురేశ్ఆచార్యులు




శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం, కొమళ్ళ గ్రామము, జనగామ జిల్లా, రఘూనాథపల్లి మండలం. జనగామకు 14 కిలోమీటర్లు, వరంగల్‌కు 50 కిలోమీటర్లు. జనగామ, వరంగల్ ప్రధాన రహదారిలో ఉంటుంది. సుమారు 300 సంవత్సరాల క్రితం ఈ దేవాలయం కట్టించారు. దగ్గరలో గోవర్ధనగిరి గుట్ట ఉంది. అక్కడ నెరిసిన పెరుమాళ్ళకు సంవత్సరానికి ఒకసారి ఉత్సవం అవుతుంది. నిత్యం పెరుమాళ్ళను ఆరాధించుకోవాలనే ఉద్దేశ్యంతో ఊర్లో ఉండే పెద్దలు గుడి కట్టారు. ఆ కాలంలో (మా ముత్తాతలు) దరిపల్లి వారు (స్వాములు) ఆ ఊరిలో ఉండేది. ఊరి పెద్దలు వెలమదొరలు, కరణములు దేవాలయము నిర్మించిరి. దేవాలయం నిత్య కైంకార్యానికి సుమారు 20 ఎకరాలు దేవుని పేరున, మరియు చాకలి, ఇతరత్ర సేవకులకు కూడా భూమిని వెలమలు ఇనాముగా ఇచ్చారు. ఆ భూమి నుండి వచ్చే ఆదాయంతో గుడి నడుస్తూ ఉన్నది. శ్రీమాన్ శ్రీ దరిపల్లి సుందరా చార్యులు మరియు వారి సోదరులు వారి సంతానం దేవాలయంలో నిత్య కైంకర్యాలు తిరునక్షత్రాలు, ధనుర్మాస, అధ్యయన, బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు.



కాలక్రమేణ గ్రామాలలో ఉపాధి కరువై మా కుటుంబం వారందరు హైదరాబాద్ నగరానికి వచ్చారు. మా చిన్నాయనగారు దరిపల్లి వరదాచార్యులు గ్రామంలో ఉండి దేవాలయం నిర్వహిస్తూ, పౌరోహిత్యం మరియు వివాహ ఉపనయనాలు, దేవాలయ ప్రతిష్ఠలు, అధ్యయన, బ్రహ్మోత్సవాలు నిర్వహించేవారు. వారి తరువాత ప్రస్తుతం వారి దౌహిత్రుడు ఉత్తలూరు అనిల్ ఆచార్య ఊర్లో ఉంటూ దేవాలయం పూజాదికాలు చేస్తున్నారు. వైశాఖ బహుళ తదియ నుండి నవమి వరకు అధ్యయన, బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా దరిపల్లి కుటుంబం వారంతా వెళ్లి నిర్వహిస్తున్నాము. సుందరాచార్యుల కుమారులు 5గురు, వారి సంతానం మనుమలు 16మంది. వారే దివ్య ప్రబంధం అధ్యయనం చేస్తారు. బ్రహ్మోత్సవ యజ్ఞాచారిగా దరిపల్లి లక్ష్మణాచార్యులు నిర్వహిస్తారు. ఉత్సవాల నిర్వహణకు ఇబ్బంది లేకుండా జరుగుతుంది.

దేవాలయం కట్టిన కొత్తలో ఆళ్వార్ల విగ్రహాలు లభించాయి కానీ ఆండాళమ్మ వారి విగ్రహం లభించలేదు, ఎలా అని చింతిస్తుండగా దరిపల్లి పెద్దలకు స్వప్నంలో అమ్మవారు అనుగ్రహించి ఎదులాబాద్ (ఘట్కేసర్ వద్ద, హైదరాబాద్) లో ఉన్నాను, ఎదులాబాద్ ప్రసిద్ధ ఆండాళ్ దివ్య క్షేత్రం. అక్కడి స్వాములనుండి స్వీకరించండి అని చెప్పారు. తెల్లవారి బయలుదేరి వెళ్లారు. అక్కడ ఎదులాబాద్ స్వాములకు కూడా స్వప్నంలో అనుగ్రహించి కొమళ్ళ గ్రామం నుండి స్వాములు వస్తున్నారు, వారికి ఇక్కడ రెండవ విగ్రహంగా ఉన్న నన్ను వారికివ్వండి అని చెప్పారు. ఆ ప్రకారంగా దేవాలయానికి ఆండాళమ్మ వారు వేంచేసారు.

బ్రహ్మోత్సవాలకు కొమళ్ళ గ్రామ ప్రజలే కాకుండా చుట్టూ ఉన్న గ్రామాలవారు, ఇతర జిల్లాల వారు కూడా అధిక సంఖ్యలో భక్తులు వచ్చి దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటారు. కోరిన కోరికలు తీర్చే కొమళ్ళ శ్రీవేణుగోపాలస్వామిగా ఈ దేవాలయం ప్రసిద్ధి పొందింది. ★




20-07-2024 శనివారం ఉదయం 10.00 గంటల నుండి కనీవినీ ఎరుగని రీతిలో శ్రీ వైష్ణవ సేవా సంఘం రజతోత్సవాలు కొనసాగుతాయి. ఈ ఉత్సవాలకు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారు మరియు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్ స్వామి వారు విచ్చేసి మంగళాశాసనాలు చేస్తున్నారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులతో పాటుగా ఉప ముఖ్యమంత్రి మరియు ఇతర మంత్రి వర్యులు హాజరౌతున్నారు. ఈ వేడుకలకు ప్రతి ఒక్క శ్రీవైష్ణవ బంధువు తమ ఇంటి పండుగ అనుకొని తప్పక హాజరై మన బలాన్ని, ఐక్యతను మన సంఖ్య ద్వారా చాటాలని శ్రీ వైష్ణవ సేవా సంఘం, తెలంగాణ ఆహ్వానిస్తుంది. ★

## ఉత్తరదేశ నైమిశారణ్యం యాత్ర






శ్రీవిష్ణుసహస్రనామ పరివారం హైదరాబాద్‌వారి ఆధ్వర్యం లో ఉత్తరదేశ యాత్ర, శ్రీ ముక్తినాథ్ ఆలయంలో అఖండ విష్ణుసహస్రనామ పారాయణం జరిపారు. నైమిశారణ్యం, అయోధ్య, చిత్రకూట్, పుణ్యనదీ స్నానములు వివిధ పుణ్యక్షేత్ర దర్శనాల తరువాత శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధి, శ్రీమదహోబిలమఠం, హైదరాబాదు యందు శ్రీమాన్ సామవేదం పార్థసారథి గారి ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, భాగవత తదియారాధన కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## శ్రీ రంగనాథస్వామివారి బ్రహ్మోత్సవములు

అన్నాసాగరం, కరీంనగర్ రోడ్, హనుమకొండ శ్రీరంగనాథ దేవాలయము 15వ బ్రహ్మోత్సవములు జూన్ 24 నుండి 29 వరకు జరిగాయి. జూన్ 24 నాడు శ్రీరంగనాథస్వామివారి కళ్యాణోత్సవం వైభవంగా జరిగింది.





# బాలవిజ్ఞానం

## న్యాయానికే విజయం



కోసల అనే రాజ్యాన్ని పరిపాలించే హిరణ్య గర్భుడు అను రాజు ధర్మబద్ధంగా జీవించేవాడు. ప్రజలను చక్కగా పరిపాలించే వాడు. సామంత రాజులతో కూడా కలిసి మెలిసి ఉండేవాడు. నీతిమంతులైన ముగ్గురు మంత్రులు ఆయన దగ్గర ఉండేవారు.

ఆ రాజుకు సంతానం లేదు చాలా సంవత్సరాలు ఎదురు చూసి ఎన్నో పూజలు చేసి దోష పరిహారం కొరకు పురోహితులను అడిగాడు. వారు అనేక రకాలుగా పరిశీలించి రాజుకు గల దోషాన్ని తెలిపారు.

రాజుకు తల్లి తండ్రి చిన్నతనంలో మరణించారు. ఒక సవతి తల్లి మాత్రం ఉంది. ఆమెను రాజు ఎంతో ప్రేమగా, గౌరవంగా చూసుకునేవాడు. కాని ఆమెకు మాత్రం హిరణ్య గర్భుడు అంటే అంతగా నచ్చదు.

ఆ దోషము వల్లనే సంతానం కలగకపోయి ఉండవచ్చునని పురోహితులు చెప్పారు. దానికి పరిహారం ఏమిటని రాజు అడిగాడు. ఎన్నో ధర్మశాస్త్రాలు చదివి పురోహితులు ఒక మార్గాన్ని సూచించారు. తల్లిని తను ఆదరించడంలో ఏ లోపం లేదు. కనుక మరో మార్గం తెలిపారు. భూమండలంలో గల అనేక ప్రాంతాల్లో రాజు కీర్తి కనుక వ్యాపించి ఉంటే ఈ దోషం పోతుందని చెప్పారు.

వెంటనే రాజు తన మంత్రులైన కీర్తిమంతుడు, మూర్తిమంతుడు, శాంతిమంతుడు అను ముగ్గురు మంత్రులను పిలిచి వారికి కొంత ధనాన్ని పరివారాన్ని ఇచ్చి సంవత్సరాంతం తిరిగి వచ్చేలా ఏర్పాటు చేసి దేశం నలుమూలలకి పంపించాడు. వారు అంగ వంగ కళింగ కాంభోజాది రాజ్యాలు తిరిగి అనేక పుణ్య నదీ తీర్థాలలోను పుణ్యక్షేత్రాలలోనూ రాజు పేరుతో అర్చనలు జరిపి తిరిగి వచ్చారు.

మర్నాడు రాజు సభ ఏర్పాటు చేశాడు. అందరూ కొలువుతీరు ఉండగా ముగ్గురు మంత్రులు తమ అనుభవాలను రాజు యొక్క కీర్తి ప్రతిష్ఠలను తాము మరింత ప్రచారం చేసిన విధానాన్ని తెలియచెప్పుతున్నారు. చివరిగా శాంతి మంతుడు వివరిస్తూ విదర్భ రాజ్యంలో తనకు కలిగిన అనుభవాన్ని చెప్పుతున్నాడు.

“ఎంతో కీర్తివంతుడైన సువర్ణదీప్తి మహారాజు విదర్భ దేశపు రాజు.ఆ రాజ్యంలో మట్టుకు మీ గొప్పతనాన్ని ఒప్పుకోలేదు. (అసంతుష్టో ద్విజో నష్టః సంతుష్టోపి నరాధిపః) తృప్తి లేని బ్రాహ్మణుడు సంతృప్తి కలిగిన రాజు నష్టపోతారు. అనే న్యాయాన్ని చెప్పి తనకన్నా గొప్పవాడైన రాజును రాజ్యాన్ని అక్రమించి కొవాలి అనుకున్నాడు సువర్ణదీప్తుడు. అందువల్ల మన రాజ్యం పైన దండెత్తి రావటానికి సిద్ధపడ్డాడు. లేదా నా చేత ఆ రాజు యొక్క గొప్పతనాన్ని పొగడమని అన్నాడు. కానీ ఆ పని నేను చేయలేను మహారాజా!” అని ఎంతో బాధపడుతూ జరిగిన విషయాన్ని తెలిపాడు.

శాంతి మంతుని ఉద్దేశాన్ని గ్రహించిన హిరణ్య గర్భుడు పురోహితుల సలహాతో అప్పటికి మౌనంగా ఉండిపోయాడు. కానీ చెలికత్తెల ద్వారా తన కుమారుని యొక్క వృత్తాంతాన్ని తెలుసుకొని రాజు తల్లి కొంత చింతించింది. నిష్కారణంగా కొడుకు పైన కోపం ఉండకూడదు. అని భావించి హిరణ్య గర్భుని పిలిపించి మనస్ఫూర్తిగా ఆశీర్వదించింది.

హిరణ్యగర్భుని సైనిక బలాన్ని, ధర్మ బలాన్ని, నైతిక బలాన్ని తెలుసుకొని తన గురువుల సలహాతో సువర్ణదీప్తి మహారాజు మిత్రునిగా మారాడు. హిరణ్యగర్భునికి సంతానం కలిగింది. ఫలితాన్ని ఆశించకుండా న్యాయంగా నడుచుకునే వారికి మంచే జరుగుతుందని అందరూ భావించారు.


# శ్రీసన్నిధి పదకేళి 5

## ఆధారాలు నిలువు:

1. అత్రి మహర్షి భార్య 4)
2. ఇంద్రుని ఆయుధం 4)
3. యామున మునుల ప్రియ శిష్యుడు (5)
4. ఫల్గుణసఖుని బొట్టు (4)
5. విష్ణు మూర్తిని పూజించటానికి ఇది ఉపయోగిస్తారు (6)

## ఆధారాలు అడ్డం:

5. రామచరితమానస్ ఎవరిది (5)
6. అర్చిరాది సంగ్రహంలో 6,7,8 లోకాలు వరుసగా 6 7 8 గళ్ళలో (2)
9. కాకాసురుడు (ఏ పక్షి) (2)
10. మృగశిరకార్తె నాటి భగవత్ ప్రసాదం (3)
11. ఆచార్యులు, గురువులు, పండితులు చెప్పే వాటిని ? (5)
12. 'వైశాఖ బహుళ దశమి పూర్వాభాద్ర' ఎవరు అవతరించారు ? (5)
13. ఎదుటి వారు అడిగేది (2)



## శ్రీసన్నిధి పదకేళి (3) సమాధానాలు

విజేతలకు జులై నెల పత్రిక పంపించడం జరుగుతుంది

నిలువు: 1. చాతుర్మాస్య, 2. విశ్వకర్మా ,3. విష్ణుచిత్తుడు, 4. మంచిమాట 5. విప్రనారాయణ, అడ్డం : 5. విరజానది 6. లక్ష్మీ, 7. కృష్ణ, 8. హెూళి, 9. చేప, 10. ఆషాఢం 11. నారాయణుడు, 12. సర్పయాగం, 13. అల

సరియైన సమాధానాలు పంపినవారు: వనమాల రామలింగాచారి, యాదగిరిగుట్ట, బిక్కునూరు రాజేశ్వర్, నిర్మల్, వై. శివప్రసాద్, బోయవాడ, కరీంనగర్, జి. సువర్ణ, సిరిసిల్ల, సి. హెచ్. మురళీకృష్ణ, కూకట్‌పల్లి, హైదరాబాద్, సి. రాంప్రసాదరావు, విజయవాడ. సుధేష్ణ గట్ల, కరీంనగర్,

## పదకేళిలో పాల్గొనండి! ఉచిత పత్రిక అందుకోండి!!

ఈ పదకేళిలో సరియైన సమాధానాలు వ్రాసి సరియైన జవాబులు 9502583323 వాట్సప్ ద్వారా పంపండి.

Printed & Edited and Published by DINGIRI SRINIVASA MURTHY on behalf of SRISANNIDHANAM CHARITABLE TRUST and Published at H.No 10-2-225, Vidhyanagar, Karimnagar, Telangana - 505 001
Editor DINGIRI SRINIVASA MURTHY, RNI Title No TELTEL12303, Cell No : 9502583323, Land line No 0878-2253323
Email Id prapatti.srisannidhanam9@gmail.com.